ఈనాడు
భద్రాద్రి కొత్తగూడెం
బుధవారం అక్టోబరు 9, 2024

దసరా పండుగ అందరి జీవితాల్లో వెలుగులు నింపాలి: పొంగులేటి


కలెక్టరేట్‌లో నిర్వహించిన బతుకమ్మ సంబురాల్లో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి, చిత్రంలో ఎంపీ రఘురాంరెడ్డి, విజయబాబు, కలెక్టర్ జితేశ్ వి.పాటిల్

కొత్తగూడెం కలెక్టరేట్, న్యూస్‌టుడే: దసరా పండుగ అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆకాంక్షించారు. కలెక్టరేట్‌లో మంగళవారం రాత్రి నిర్వహించిన బతుకమ్మ సంబురాలకు ఆయన హాజరై ప్రసంగించారు. బతుకమ్మ పండుగ ప్రకృతిని పూజించడంతోపాటు ఆరోగ్యం, దైవత్వంతో పాటు అందరినీ ఒక వేదిక మీదికి తెచ్చే వేడుక అని వివరించారు. తమ ప్రభుత్వంలో ఉద్యోగుల న్యాయమైన కోర్కెలను తప్పకుండా తీర్చుతామని, రెవెన్యూ ఉద్యోగులకు ఉద్యోగోన్నతులు కల్పిస్తామని తెలిపారు. అవకాశం ఉంటే దసరా పండుగ లోపే ఉద్యోగోన్నతులు ఇస్తామన్నారు. వ్యవసాయశాఖలో పని ఒత్తిడి ఎక్కువగా ఉందని, ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని కలెక్టర్ తన దృష్టికి తెచ్చారని చెప్పారు. ఈ సమస్యనూ త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. ఇది ప్రజా ప్రభుత్వమని, ప్రభుత్వ ఉద్యోగుల సహకారం ఎప్పుడూ ఉండాలని, వారి సమస్యలు పరిష్కరించేందుకు సీఎం రేవంత్ రెడ్డి సిద్ధమేనని పేర్కొన్నారు. సింగరేణి కార్మికులకు రూ.796 కోట్ల వరకు బోనస్ అందించిన అంశాన్ని గుర్తుచేశారు. ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి మాట్లాడుతూ జిల్లా ప్రజలకు బతుకమ్మ, దసరా పండుగల శుభాకాంక్షలు తెలిపారు. నీటిపారుదల అభివృద్ధి సంస్థ ఛైర్మన్ మువ్వా విజయబాబు, కలెక్టర్ జితేశ్ వి.పాటిల్, అదనపు కలెక్టర్లు డి.వేణుగోపాల్, విద్యాచందన, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

బతుకమ్మ సంబురాల్లో..

బతుకమ్మ వేడుకల్లో కలెక్టర్ జితేశ్ వి.పాటిల్, శ్రద్ధ మహాజన్ దంపతులు, కుమారుడు రాఘవ్, దనపు కలెక్టర్ డి.వేణుగోపాల్, సంధ్య, కుమారులు జశ్వంత్, యతిన్, అదనపు కలెక్టర్ విద్యాచందన, ఏఓ ఎం.రమాదేవి, జిల్లా సంక్షేమాధికారి విజేత, వివిధ శాఖల అధికారులు, మహిళలు పాల్గొన్నారు. తొలుత బతుకమ్మలకు కలెక్టర్, అదనపు కలెక్టర్ దంపతులు పూజ చేశారు. ఉద్యోగినులు ఆడిపాడారు.


బతుకమ్మ ఆడుతున్న కలెక్టర్ దంపతులు, ఉద్యోగినులు

మహాలక్ష్మిగా పెద్దమ్మ దర్శనం

పాల్వంచ పట్టణం, న్యూస్‌టుడే: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పాల్వంచ పెద్దమ్మతల్లి దేవాలయంలో అమ్మవారు మహాలక్ష్మిగా దర్శనమిచ్చారు. అమ్మవారికి రుద్రాభిషేకం, రుద్రహోమంతోపాటు మంగళవారం సందర్భంగా ఆంజనేయస్వామికి పంచామృతాభిషేకం నిర్వహించారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ కొత్తగూడెం డివిజన్ పరిశీలకులు పి.భేల్‌సింగ్, ఆలయ కార్యనిర్వహణాధికారి ఎన్.రజనీకుమారి, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.


అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

ఉపాధి హామీకి పక్కా ప్రణాళిక

ఈనాడు డిజిటల్, కొత్తగూడెం, న్యూస్‌టుడే, ఖమ్మం బలేపల్లి

పల్లెల్లో వలసల నివారణ, సన్న, చిన్నకారు రైతుల అభ్యున్నతే లక్ష్యంగా ఏటా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పనులు చేపడుతున్నారు. ఈమేరకు 2025-26 ఆర్థిక సంవత్సరంలో చేపట్టే పనులకు అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లోని గ్రామాల్లో సభలు నిర్వహిస్తూ పనుల గుర్తింపు చర్యలు చేపడుతున్నారు. నవంబరు 30 వరకు ఈ ప్రక్రియను పూర్తిచేయనున్నారు.

జిల్లాలో వార్షిక ప్రణాళికల వివరాలు (అంకెలు లక్షల్లో)

సంవత్సరం	పనిదినాల కల్పన లక్ష్యం	కల్పించిన పనిదినాలు
2021-22	51.55	53.56
2022-23	45.38	48.65
2023-24	43.16	47.54
2024-25 (అక్టోబర్ 8 వరకు)	46.97	43.95

100 రోజుల పని

జాబ్‌కార్డులు.. 2.23 లక్షలు

కూలీలు.. 4.59 లక్షలు

కార్మిక బడ్జెట్ ఆధారంగానే..

గ్రామాల్లో ప్రాధాన్యం కలిగిన పనులను గుర్తించి గ్రామసభల ద్వారా ప్రజల ఆమోదం పొందనున్నారు. గ్రామ, మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో గుర్తించిన పనులకు కార్మిక బడ్జెట్ రూపొందించి కేంద్రానికి నివేదిస్తారు. బడ్జెట్‌కు కేంద్రం ఆమోదం తెలిపితే.. దాని ఆధారంగా వచ్చే ఏప్రిల్ నుంచి వార్షిక ప్రణాళిక ద్వారా ఉపాధి హామీ పనులు చేపట్టనున్నారు. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లోని 1,070 పంచాయతీల్లో ఈనెలాఖరులోగా గ్రామసభలు పూర్తిచేసి, నవంబర్‌లో మండలాల వారీగా ప్రణాళికలు రూపొందించనున్నారు.

ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు 2025-26 ఆర్థిక సంవత్సరంలో చేపట్టాల్సిన ఉపాధి హామీ పనులకు సంబంధించిన అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నాం. లక్ష్యం మేరకు కూలీలకు పనిదినాలు కల్పిస్తాం.

– రవి, డీఆర్‌డీఏ అదనపు పీడీ, భద్రాద్రి కొత్తగూడెం

మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట

ఉపాధి హామీ పథకంలో మొత్తం 266 రకాల పనులు చేపట్టవచ్చు. ఉభయ జిల్లాల్లో ప్రధానంగా పల్లెల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేయాలని కలెక్టర్లు నిర్ణయించారు. అంగన్‌వాడీ కేంద్రాలు, పంచాయతీ భవనాలు, మరుగుదొడ్లు, అనుసంధాన రహదారులు, ఇంకుడుగుంతలు, చెక్ డ్యాంల నిర్మాణంతో పాటు పంట కాల్వల్లో పూడికలు తీయటం, వ్యవసాయ అనుబంధ రంగాలైన పాడిపరిశ్రమ, కోళ్ల, మేకల పెంపకానికి కావాల్సిన షెడ్ల ఏర్పాటుకు ప్రాధాన్యమివ్వనున్నారు. ఖమ్మం జిల్లాలో 2023-24లో 3.08 లక్షల మంది పనులు చేయగా 4,253 కుటుంబాలు 100 రోజులు పూర్తిచేసుకున్నాయి. 2024-25లో ఈనెల 8 వరకే 574 కుటుంబాలకు 100 రోజుల పని కల్పించారు. భద్రాద్రి జిల్లాలో 2023-24లో 2.30లక్షల మంది ఉపాధి కూలీలు పనులు చేయగా. 3,554 కుటుంబాలు 100 రోజులు పూర్తి చేసుకున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికే 1,061 కుటుంబాలకు 100 రోజుల పని కల్పించారు.

రాష్ట్రంలో విద్యారంగానికి పెద్దపీట

ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క

ఖమ్మం మామిళ్లగూడెం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో విద్యారంగానికి పెద్దపీట వేస్తున్నామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ శాఖల్లో అభివృద్ధి పథకాలు, వరద సహాయక చర్యలపై ఖమ్మం కలెక్టరేట్‌లో అధికారులతో మంగళవారం సమీక్షించారు. జిల్లా అధికారులు పక్షం రోజులకోసారి సంక్షేమ వసతిగృహాల్లో రాత్రి బస చేయాలని ఆదేశించారు. త్వరలోనే సంక్షేమ వసతిగృహాలను తనిఖీ చేస్తామని, ఏదైనా సమస్య కనిపిస్తే సంబంధిత జిల్లా అధికారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పుస్తకాలు, ఏకరూప దుస్తులు, ఉపకార వేతనాల చెల్లింపులపై క్యాలెండర్ రూపొందించి తదనుగుణంగా ప్రణాళికలు రూపొందిస్తామని తెలిపారు. ఖమ్మం జిల్లాలో ఇటీవల భారీ వర్షాలు, వరదల ఉద్ధృతికి పైపులైన్లు దెబ్బతినటంతో ఎర్రుపాలెం, కూసుమంచి మండలాల్లో తాగునీటి సరఫరాకు ఇబ్బందులు ఎదురయ్యాయని పేర్కొన్నారు. అధికారులు ఆయా ప్రాంతాలను సందర్శించి తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలని ఆదేశించారు. వరదల సమయంలో విద్యుత్తు సంస్థ అధికారులు, సిబ్బంది పనితీరు అభినందనీయమన్నారు. కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ వరద బాధితులకు నష్టపరిహారం చెల్లించామని తెలిపారు. నగరపాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య, జడ్పీ సీఈఓ దీక్షారైనా, డీఆర్‌డీఓ సన్యాసయ్య, పాల్గొన్నారు.


ఖమ్మంలో మాట్లాడుతున్న ఉపముఖ్యమంత్రి భట్టి

రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లాకు 23 పతకాలు

కొత్తగూడెం సింగరేణి, న్యూస్‌టుడే: హనుమకొండలో ఈనెల 7, 8 తేదీల్లో జరిగిన రాష్ట్ర జూనియర్ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లా అథ్లెట్లు మొత్తం 23 పతకాలు గెలుచుకొన్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.మహిదర్ తెలిపారు. స్వర్ణాలు-7, రజతాలు-10, కాంస్య పతకాలు ఆరింటిని గెలిచారని, 53 పాయింట్లతో ఓవరాల్ ఛాంపియన్‌షిప్ సాధించారని వెల్లడించారు.

వంటలకు పనికిరాని కారం..!

పినపాక, న్యూస్‌టుడే: వంటలకు పనికిరాని కారం అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా అవుతోంది. మణుగూరు ప్రాజెక్టు పరిధిలో 208 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. గర్భిణులు, బాలింతలు, 3-6 ఏళ్లలోపు చిన్నారులకు రోజూ పోషకాహారం అందిస్తారు. ఈనేపథ్యంలో ప్రతి కేంద్రానికి మూడు నెలలకోసారి పప్పు, కారం, పసుపుతోపాటు పోపులు పంపిణీ చేస్తారు. ఆరు నెలలుగా సరఫరా చేస్తున్న కారం తెల్లగా ఉండటంతోపాటు వాసన వస్తోంది. కూరల్లో ఎంత వేసినప్పటికీ కారం ఉండకపోవడంతోపాటు తెల్లగా మారుతోందని వివిధ కేంద్రాల నుంచి ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఆరోగ్యకరమైన ఆహారం అందించాల్సిన బాధ్యత కలిగిన అంగన్‌వాడీ కేంద్రాలకు పనికిరాని వంట సరకులు పంపిణీ చేయటంపై పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేంద్రాలకు వచ్చేవారు ఇబ్బంది పడకుండా కొంతమంది నిర్వాహకులు తమ ఇళ్ల నుంచి కారం తీసుకొచ్చి వంట చేస్తున్నారు. ఈ విషయంపై సీడీపీఓ జయలక్ష్మి 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ వివిధ కేంద్రాల నుంచి కారం విషయంలో ఆరోపణలు వచ్చాయన్నారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. త్వరలోనే సమస్యను పరిష్కరిస్తామన్నారు.


అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసిన కారం

రైతు నేస్తం.. సాగుకు ఉపయుక్తం

కొత్తగూడెం వ్యవసాయం, ఖమ్మం వ్యవసాయం, న్యూస్‌టుడే

అధునాతన సాగు ఒరవడులు, సస్య రక్షణపై కర్షకులకు సలహాలిచ్చేందుకు ఈ వానాకాలం సీజన్ నుంచి ప్రభుత్వం ప్రయోగాత్మకంగా 'రైతు నేస్తం' కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. వాతావరణానికి తగ్గట్టుగా సూచనలివ్వడం ద్వారా వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాలన్నదే ఈ కార్యక్రమం లక్ష్యం. ఇందుకోసం హైదరాబాద్ నుంచి వ్యవసాయ శాస్త్రవేత్తలు, రైతులతో వీడియో కాన్ఫరెన్స్‌లను ప్రతి మంగళవారం నిర్వహిస్తోంది.

'రైతునేస్తం'ను తొలుత నియోజకవర్గాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేశారు. స్పందన బాగుండటంతో వీసీలను కొద్ది వారాలుగా అన్ని మండలాలకు విస్తరించారు. మండలానికి ఒకటి చొప్పున రైతువేదికల్లో ప్రతివారం వ్యవసాయ శాఖ మండలాధికారులు, వ్యవసాయ విస్తరణాధికారులు స్థానిక రైతులను ప్రొ.జయశంకర్ తెలంగాణ వ్యవసాయ వర్సిటీ శాస్త్రవేత్తలతో మాట్లాడిస్తున్నారు. యాజమాన్య పద్ధతులు, ఎరువుల యాజమాన్యం, కలుపు నివారణ, వంగడాల ఎంపిక, వర్షాభావం, అధిక వర్షాల సమయాల్లో పంటల వారీగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సస్యరక్షణ వివరాలను తెలుసుకునేలా ప్రోత్సహిస్తున్నారు. ముఖ్యంగా ఆయిల్‌పాం, ఆకు కూరలు, వరితో పాటు పత్తి, మిరప వాణిజ్య పంటలు, చిరుధాన్యాలు, కూరగాయల నూతన సాగు విధానాలను ఆసక్తిగా అడిగి తెలుసుకుంటున్నారు. సీజనల్‌గా పశువులకు వ్యాప్తిచెందే వ్యాధులు? అందించాల్సిన టీకాల గురించి సంబంధిత శాఖాధికారులు అవగాహన కల్పిస్తున్నారు. వివిధ పంటలకు రైతులకు వచ్చే రాయితీలు, దరఖాస్తు విధానాలను ముఖాముఖిల ద్వారా వ్యవసాయాధికారులు తెలియజేస్తున్నారు. సాధ్యమైనన్ని గ్రామాలకు ఈ కార్యక్రమాన్ని విస్తరించాలని యువ రైతులు కోరుతున్నారు.



ఎక్కడెక్కడ?

ఖమ్మం జిల్లాలోని 21 మండల కేంద్రాల్లోని రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్‌లు నిర్వహిస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మొత్తం 23 మండలాలున్నాయి. అనంతారం (కరకగూడెం), జగన్నాథపురం (పాల్వంచ), కాకర్ల (జూలూరుపాడు), మొడికుంట (అశ్వాపురం), నాగుపల్లి (దమ్మపేట), నర్సాపురం (దుమ్ముగూడెం), కోయగూడెం (టేకులపల్లి) మినహా మిగతా అన్నిచోట్ల మండల కేంద్రాల్లోని 'రైతు నేస్తం' కొనసాగుతోంది.

'రైతునేస్తం వీడియో కాన్ఫరెన్స్‌లో స్థానిక వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక అధికారులు అందుబాటులో ఉంటున్నారు. ఎక్కువ మంది రైతులు హాజరై శాస్త్రవేత్తల సూచనలు పాటించాలి. ప్రతికూల వాతావరణాన్ని అధిగమించి, ప్రభుత్వ రాయితీలు సద్వినియోగం చేసుకుంటూ సాగును లాభసాటిగా మార్చుకోవాలి".

- వి.బాబురావు, జిల్లా వ్యవసాయ శాఖాధికారి, భద్రాద్రి

"ప్రస్తుత సీజన్‌లో 35 ఎకరాల్లో వరి, ఐదెకరాల్లో కూరగాయలు సాగుచేస్తున్నా. ప్రొ.జయశంకర్ వర్సిటీ వ్యవసాయ శాస్త్రవేత్తలతో పలుమార్లు నేరుగా మాట్లాడాను. పంటల సాగుపై కొత్త విషయాలను తెలుసుకున్నాను. వరిలో కొత్త వంగడాల సమాచారం ఉపయుక్తంగా ఉంది. సొంతంగా విత్తనాలను ఎలా తయారు చేసుకోవాలో శాస్త్రవేత్తలు ఇచ్చిన సలహాలు ఉపయోగపడ్డాయి. అధిక దిగుబడి సాధించేందుకు కావాల్సిన సమాచారం లభించింది."



- గొట్టిపాటి వెంకటేశ్వరరావు, హేమచంద్రాపురం (లక్ష్మీదేవిపల్లి)

వరి పంటను పరిశీలించిన కేవీకే శాస్త్రవేత్తలు

సుజాతనగర్, న్యూస్‌టుడే: సుజాతనగర్ మండలంలో ఎంటీయూ 1262 వరి రకం పంటలను కేవీకే శాస్త్రవేత్తలు మంగళవారం పరిశీలించారు. సుజాతనగర్‌లో వరి పంటల క్షేత్ర పరిశీలన నివేదికలను పొందుపరుస్తామని వెల్లడించారు. వరి పంటకాలం 160 రోజులని, నెల రోజుల ముందుగానే వరి పంట చేతికందుతోందని, తద్వారా దిగుబడి తగ్గుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. కార్యక్రమంలో కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ నారాయణమ్మ, శాస్త్రవేత్త శివ, మండల వ్యవసాయాధికారి నర్మద, ఏఈఓ శరత్‌చంద్ర, నర్సింహారావు, రైతులు పాల్గొన్నారు.


సుజాతనగర్‌లో వరి పంటను పరిశీలిస్తున్న నారాయణమ్మ తదితరులు

వసతిగృహాలను సందర్శించిన కలెక్టర్

పాల్వంచ, న్యూస్‌టుడే: పాల్వంచ పట్టణం బొల్లోరిగూడెంలోని ఎస్సీ, బీసీ వసతిగృహాలను కలెక్టర్ జితేశ్ వి.పాటిల్ మంగళవారం సందర్శించారు. మరుగుదొడ్లు, తాగునీరు, వసతి గదులను పరిశీలించారు. పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారించాలని సిబ్బందిని ఆదేశించారు. వసతిగృహాలకు చిన్నపాటి మరమ్మతులుంటే సెలవుల్లో చేయించుకోవాలన్నారు. ఎస్సీ సంక్షేమాధికారిణి అనసూయ, బీసీ సంక్షేమాధికారిణి ఇందిర, సూపరింటెండెంట్ హనుమంతరావు, సంక్షేమాధికారులు, తహసీల్దారు వివేక్, మున్సిపాలిటీ కమిషనర్ ఢాకునాయక్ పాల్గొన్నారు.

ఇంతుల పండగకు బంతి దొరికేనా!

పూల ధరలకు రెక్కలు

ఖమ్మం వ్యవసాయం, న్యూస్‌టుడే

ఇటీవలి భారీ వర్షాలు, వరదలతో పలు రకాల పంటలు దెబ్బతిన్నాయి. పూల తోటలకు సైతం నష్టం వాటిల్లింది. దిగుబడి తగ్గి డిమాండ్ పెరిగింది. పండుగలవేళ పుష్పాల ధరలకు రెక్కలొచ్చాయి. ఖమ్మం జిల్లాలోని బోనకల్లు, ఖమ్మం అర్బన్, రఘునాథపాలెం, తిరుమలాయపాలెం, కొణిజర్ల, వైరా, కామేపల్లి, ఏన్కూరు మండలాల్లో సుమారు 250 నుంచి 300 ఎకరాలు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని సుజాతనగర్, చుంచుపల్లి, దమ్మపేట, చంద్రుగొండ, అశ్వారావుపేట, ములకలపల్లి తదితర మండలాల్లో 350 నుంచి 400 ఎకరాల వరకు పూల తోటలు సాగు చేస్తారు. బంతి, చామంతి, కనకాంబరం, మల్లె, లిల్లీ పూలు సాగు చేస్తారు. బోనకల్లు, వైరా, పల్లిపాడు ప్రాంతాల్లో రోడ్ల పక్కన విక్రయిస్తున్నారు. ఖమ్మం నగరంలో బతుకమ్మ పండుగ ప్రారంభం నుంచి కొనుగోళ్లు ఊపందుకున్నాయి.



బోనకల్లు మండలంలో బంతిసాగు

పండగల వేళ పైపైకి....

బతుకమ్మ సీజన్ కావటంతో ధరలు పెరుగుతున్నాయి. బంతిపూలు టోకు విపణిలో కిలో రూ.70 నుంచి రూ.80 వరకు ధర ఉండగా బయట రూ.100 చొప్పున విక్రయిస్తున్నారు. గులాబీ కిలో రూ.250 నుంచి రూ.350 వరకు టోకు, బయట రూ.380 నుంచి రూ.400 విక్రయిస్తున్నారు. జిల్లాలో పూలు ఇక్కడి అవసరాలకే సరిపోతున్నాయి. కొన్ని మండలాలకు చెందిన రైతులు ఏపీలోని జగ్గయ్యపేట, విజయవాడ వంటి మార్కెట్లలో విక్రయిస్తున్నారు.

కార్తీక మాసంలో మరింత డిమాండ్...

కార్తీక మాసం, దసరా, దీపావళి, అయ్యప్ప భక్తుల దీక్షల నేపథ్యంలో రాబోయే రెండు నెలల్లో పూలకు గిరాకీ మరింత పెరుగుతుంది. పండుగలను దృష్టిలో పెట్టుకుని రైతులు ముందస్తు ప్రణాళిక ప్రకారం సాగు చేస్తున్నారు. ఎకరానికి కనీసం రూ.50 వేల వరకు పెట్టుబడి పెడుతున్నారు. ఖర్చులు పోను రైతులకు నికరలాభం రూ.50 వేల నుంచి రూ.75 వేల వరకు వచ్చే అవకాశం ఉంటుంది.

వర్షాలకు తీవ్ర నష్టం: బొడ్డుపల్లి నాగచంద్రుడు, బోనకల్లు

ఈసారి భారీ వర్షాలతో పంట చాలా వరకు దెబ్బతిన్నది. దిగుబడి ఆశించిన స్థాయిలో లేదు. ధర ఆశాజనకంగా ఉండటం కొంత ఊరట కలిగిస్తోంది. కొన్ని సంవత్సరాల నుంచి ప్రణాళిక ప్రకారం పూల సాగు చేస్తున్నాను. పర్వదినాలను దృష్టిలో పెట్టుకుని సాగు చేయటంతో లాభసాటిగా ఉండేది. మార్కెట్లో డిమాండ్ ఉంది.

కొలువు.. ఆయనకు సులువు

నాలుగు ఉద్యోగాలు సాధించిన యువకుడు



శానం ప్రసాద్

చింతకాని, న్యూస్‌టుడే

కృషి.. పట్టుదల.. తదేక దీక్ష.. ఉంటే సాధించలేనిది ఏదీలేదని నిరూపించారు చింతకాని మండలం సీతంపేటకు చెందిన యువకుడు శానం ప్రసాద్. పుట్టింది నిరుపేద కుటుంబం. ప్రభుత్వ పాఠశాలల్లో విద్య.. ఉద్యోగం కోసం రాసిన ప్రతి పోటీ పరీక్షలోనూ విజయం సాధించి శభాష్ అనిపించుకున్నాడు. తాజాగా ఉపాధ్యాయ కొలువు చేజిక్కించుకొని వరుసగా నాలుగు ఉద్యోగానికి ఎంపిక కావటం అభినందనీయం.

★ 2012లో జరిగిన స్టాఫ్ సెలక్షన్ కమిటీ పరీక్షలో ప్రతిభ కనబర్చి చెన్నైలో గ్రూప్-డి ఉద్యోగానికి ప్రసాద్ ఎంపికయ్యారు.

★ అదే సంవత్సరం ఆర్ఆర్‌బీ నియామక పరీక్షలో ప్రతిభ చూపి ఆదిలాబాద్‌లో ఉద్యోగ విధుల్లో చేరారు. 2012 నుంచి 2015 వరకూ బెల్లంపల్లి రైల్వే స్టేషన్‌లో విధులు నిర్వర్తించారు.

★ 2015లో పోస్టల్ అసిస్టెంట్ ఉద్యోగానికి ఎంపిక కావటంతో ఆయన మణుగూరులో ఉద్యోగంలో చేరారు. ప్రస్తుతం చింతకాని పోస్టాఫీస్‌లో పోస్టల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు.

★ ప్రస్తుత డీఎస్సీలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ప్రసాద్ మంగళవారం విడుదల చేసిన డీఎస్సీ జాబితాలో ఎస్జీటీ పోస్టుకు ఎంపికయ్యారు. బుధవారం ముఖ్యమంత్రి చేతుల మీదుగా నియామక పత్రం అందుకోనున్నారు.

★ తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే తాను ఉద్యోగం సాధించాననీ.. గ్రూప్-2 అధికారి కావాలన్నదే తన లక్ష్యమని ప్రసాద్ తెలిపారు.

వ్యవసాయ మార్కెట్‌కు నాలుగు రోజులు సెలవులు

ఖమ్మం వ్యవసాయం, న్యూస్‌టుడే: ఈనెల 10 నుంచి 13వ తేదీ వరకు నాలుగు రోజులు ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు సెలవులు ప్రకటించినట్లు మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి పి.ప్రవీణ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తేదీ దుర్గాష్టమి, 11 మహార్నవమి, విజయదశమి సందర్భంగా 12, 13 తేదీల్లో సెలవులు ఉన్నందున రైతు సోదరులు గమనించి సహకరించాలని కోరారు. 14న తిరిగి మార్కెట్ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

రమణీయంగా సీతారామ కల్యాణోత్సవం

భద్రాచలం, న్యూస్‌టుడే: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామివారి ఆలయంలో మంగళవారం సుప్రభాతం పలికి ఆరాధించారు. స్వామివారు దివి నుంచి భువికి దిగి వచ్చిన తీరును వైదిక పెద్దలు చెప్పి అలరించారు. కన్యాదానం నిర్వహించి కంకణాలను ధరింపజేశారు. నిత్యకల్యాణ క్రతువును వివరిస్తూ మాంగల్యధారణను కొనసాగించారు. తలంబ్రాల వేడుక ఆధ్యాత్మికతను పెంచింది. దర్బారుసేవ వైభవాన్ని సంతరింపచేసింది. ఆంజనేయుడికి అభిషేకం చేసి సుందరకాండను పారాయణం చేశారు. హనుమాన్ చాలీసాను పఠించారు. సింధూరాన్ని భక్తుల నుదట తిలకంగా తీర్చిదిద్దారు. వేర్వేరు చోట్ల నుంచి వచ్చిన భక్తులు ప్రధాన ఆలయంతో పాటు అనుబంధంగా ఉన్న ఆంజనేయుణ్ని, లక్ష్మీతాయారు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. రామయ్యకు బుధవారం తిరుమంజనోత్సవం నిర్వహించనున్నారు.

'డ్యూటీ మీట్' విజేతలకు పతకాలు



పోలీసు డ్యూటీ మీట్‌లో పాల్గొన్న అధికారులు, సీపీ అంబర్ కిషోర్ ఝా

వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే: పోలీసుల డ్యూటీ మీట్‌తో వృత్తి నైపుణ్యం పెరుగుతుందని వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. మూడ్రోజులుగా భద్రాద్రి జోనల్‌లోని ఖమ్మం, కొత్తగూడెం, వరంగల్ కమిషనరేట్, మహబూబాబాద్ జిల్లాలకు చెందిన పోలీసు అధికారులకు వరంగల్ కమిషనర్ కార్యాలయంలో జరుగుతున్న డ్యూటీ మీట్ మంగళవారం ముగిసింది. 18 విభాగాల్లో పోటీలు నిర్వహించారు. విజేతలకు పతకాలు అందించారు. ఇక్కడ ప్రతిభ కనబర్చిన అధికారులను హైదరాబాద్‌లో జరిగే డ్యూటీ మీట్‌కు ఎంపిక చేశారు.

ముగిసిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలు



పతకాలు సాధించిన 'లక్ష్య' అథ్లెట్లతో పారా ఒలింపియన్ జీవాంజి దీప్తి, కార్యదర్శి సారంగపాణి, నాగపురి రమేశ్

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: హనుమకొండ జిల్లా అథ్లెటిక్స్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్-2024 పోటీలు మంగళవారం ముగిశాయి. ముఖ్య అతిథిగా భారత అథ్లెటిక్స్ చీఫ్ కోచ్, ద్రోణాచార్య అవార్డు గ్రహీత నాగపురి రమేశ్, హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి హాజరై.. విజేతలకు పతకాలు అందించారు. ఈ సందర్భంగా నాగపురి రమేశ్ మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో రాణించటానికి నిరంతర సాధన అవసరమన్నారు. పారా ఒలింపియన్ దీప్తిని స్ఫూర్తిగా తీసుకొని భవిష్యత్తులో జరిగే టోర్నీల్లో రాణించాలని సూచించారు. ఏసీపీ దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. క్రీడా కోటలో పోలీసు ఉద్యోగం సాధించి జీవితంలో స్థిరపడ్డానన్నారు. రాష్ట్ర అథ్లెటిక్స్ సంఘం కార్యదర్శి సారంగపాణి పోటీల వివరాలను వెల్లడించారు. అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఏఎఫ్ఐ) టైమింగ్ ఆధారంగా జాతీయ స్థాయిలో పాల్గొనే క్రీడాకారుల ఎంపిక ఉంటుందని వివరించారు.

రాణించిన 'లక్ష్య' అథ్లెట్లు

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో ఈనాడు 'లక్ష్య' అథ్లెట్లు పతకాల పంట పండించారు. అండర్-20 విభాగంలో ఎండీ.ఖైఫ్ 100 మీటర్ల పరుగులో స్వర్ణం, 200 మీ. పరుగులో రజతం, తరుణ్ మార్ జావెలిన్ త్రోలో స్వర్ణం, అండర్-18 విభాగంలో దత్తు లాంగ్‌జంప్‌లో స్వర్ణం, హెప్టాథ్లన్‌లో స్వర్ణం, గణేష్ 100 మీ. పరుగులో స్వర్ణం, శ్రీధర్ 110 హర్డిల్స్‌లో కాంస్య పతకం కైవసం చేసుకున్నారు.

ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్.. ఏసీఎం లోకేశ్ మృతి

చర్ల, న్యూస్‌టుడే: ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో సోమవారం సాయంత్రం జరిగిన ఎన్‌కౌంటర్లో మావోయిస్టు పార్టీ కిష్టారం ఏరియా కమిటీ సభ్యుడు(ఏసీఎం) లోకేశ్ మృతి చెందాడు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను పోలీసులు మంగళవారం వెల్లడించారు. కిష్టారం పోలీసు స్టేషన్ పరిధిలోని పామలూరు అటవీ ప్రాంతంలో మావోయిస్టు పార్టీ కుంట- కిష్టారం ఏరియా కమిటీ సభ్యులు ఉన్నట్లు సమాచారంతో ఈనెల 6న డీఆర్‌జీ(డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్), బస్తర్ ఫైటర్స్, 206 కోబ్రా, సీఆర్పీఎఫ్ 131వ బెటాలియన్ బలగాలు సంయుక్తంగా కూంబింగ్ చేపట్టాయి. పాల్, బర్కిల్, సింగనమడుగు అటవీ ప్రాంతాలకు వెళ్లాయి. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం పామలూరు అటవీ ప్రాంతంలో మావోయిస్టులు, భద్రతా బలగాల మధ్య ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. అనంతరం ఆ ప్రాంతంలో గాలించి మావోయిస్టు మృతదేహాన్ని, ఆయుధ సామగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎదురుకాల్పుల్లో మావోయిస్టు పార్టీ కిష్టారం ఏరియా కమిటీ సభ్యుడు లోకేశ్ మృతి చెందినట్లు పోలీసులు గుర్తించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశారు. కూంబింగ్ ఆపరేషన్ కొనసాగుతున్నట్లు పోలీసు అధికారులు వెల్లడించారు.

ఇన్‌ఫార్మర్ నెపంతో హత్య

చర్ల, న్యూస్‌టుడే: ఇన్‌ఫార్మర్ నెపంతో మావోయిస్టులు ఛత్తీస్‌గఢ్‌లో ఓ గ్రామస్థుడిని హత్య చేశారు. బీజాపూర్ జిల్లా భూపాలపల్లి పోలీసుస్టేషన్ పరిధిలోని పోచనపల్లికి చెందిన తాటి కన్నయ్య(55)ను ఇటీవల అపహరించుకుపోయిన మావోయిస్టులు పదునైన ఆయుధంతో అతనిని హత్య చేశారు. మృతదేహాన్ని మంగళవారం దుబ్బపర-పోచన్నపల్లి దారిలోని పాత పాఠశాల భవనం సమీపంలో పడేశారు. కన్నయ్య 2008 నుంచి పోలీసులకు ఇన్‌ఫార్మర్‌గా వ్యవహరించిన కారణంతోనే హత్య చేసినట్లు సంఘటనా స్థలంలో మావోయిస్టులు వదిలి వెళ్లిన లేఖలో పేర్కొన్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పొలమారా.. జలధారా!



తల్లాడ మండలం అన్నారుగూడేనికి చెందిన గోవిందు నర్సయ్య అనే రైతు మిరప తోట సాగు చేశారు. ఈ తోటకు సులభ పద్ధతిలో నీరందిస్తున్నారు. పెద్ద పైపునకు సుమారు 30 నల్లాలను బిగించాడు. అలా నల్లాలను బిగించిన పైపును పొలంలోని మోటారుకు అనుసంధానం చేసి దాని ద్వారా నీరు మళ్లిస్తున్నారు. ఈ క్రమంలో సాళ్ల మధ్యలో నల్లా వచ్చే విధంగా పైపును ఏర్పాటు చేశారు. తేలికైన ఈ పద్ధతిలో సాగునీరు వృథా కాకుండా భూమిలో తేమ ఎక్కువ ఉండే ఆస్కారం ఉందని వివరించారు.


– తల్లాడ, న్యూస్‌టుడే

సత్తుపల్లిలో పట్టపగలే భారీ చోరీ

◆ రూ.28.66 లక్షల సొత్తు అపహరణ

సత్తుపల్లి, న్యూస్‌టుడే: సత్తుపల్లిలో పట్టపగలే భారీ చోరీ జరిగింది. బాధితుడు తెలిపిన ప్రకారం. ర.భ. శాఖ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేసే ఎండీ గులామ్‌ఫహీముద్దీన్ గాంధీనగర్ రోడ్-4 పరిధిలో జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న ఓ ఇంట్లో అద్దెకుంటున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి ఉదయం ఖమ్మం సమీపంలో ఉండే తన సోదరి ఇంటికి వెళ్లారు. మధ్యాహ్నం సమయంలో దుండగులు ఇంటి తలుపునకు ఉన్న తాళం పగులగొట్టి బీరువాలో ఉన్న రూ.28 లక్షల విలువైన 40 తులాల బంగారు ఆభరణాలు, మరో రూ.36 వేల వెండి వస్తువులు, రూ.30 వేల నగదును చోరీ చేశారు. రాత్రి 7 గంటలకు ఇంటికి వచ్చిన గులామ్‌ఫహీముద్దీన్ చోరీ విషయాన్ని గుర్తించి స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఖమ్మం నుంచి క్లూస్ టీంను రప్పిస్తున్నట్లు సీఐ టి.కిరణ్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గ్రామీణ వైద్యుడు దుర్మరణం



కృష్ణారెడ్డి

తల్లాడ, న్యూస్‌టుడే: తల్లాడలో సోమవారం రాత్రి రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో గ్రామీణ వైద్యుడు మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. నారాయణపురం గ్రామానికి చెందిన గ్రామీణ వైద్యుడు బొగ్గుల కృష్ణారెడ్డి(45) తల్లాడ నుంచి స్వగృహానికి బైక్‌పై బయల్దేరాడు. స్థానిక లూర్థుమాత చర్చి సమీపంలో రోడ్డు దాటుతుండగా తల్లాడకు చెందిన పఠాన్ హుస్సేన్ ద్విచక్ర వాహనం ఇతణ్ని ఢీకొంది. తలకు తీవ్ర గాయమై అపస్మారక స్థితికి చేరిన కృష్ణారెడ్డిని కుటుంబ సభ్యులు ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున కన్నుమూశాడు. మృతుని భార్య రమాదేవి ఫిర్యాదు మేరకు తల్లాడ ఏఎస్సై జేవీఆర్ కేసు నమోదు చేశారు. కృష్ణారెడ్డి మృతితో తల్లాడ, నారాయణపురం గ్రామాల్లో విషాదం అలుముకుంది.

చెన్నారంలో దారుణం..

నేలకొండపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని చెన్నారం గ్రామంలో ఆరు నెలల మగ పిండం కలకలం రేపింది. స్థానిక కాలనీలో మృత పిండాన్ని స్థానికులు గుర్తించారు. కొద్ది దూరం వీధి కుక్కలు లాక్కుని వచ్చినట్లు తెలుస్తోంది. సమాచారమందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని సందర్శించి వివరాలు సేకరించారు. పిండాన్ని స్వాధీనం చేసుకుని నేలకొండపల్లి సీహెచ్‌సీకి తరలించారు. అబార్షన్ జరిగిందా? కావాలని ఎవరైనా ఇక్కడ పడేశారా అనేది తెలియాల్సి ఉంది.

సింగరేణి ఉద్యోగాల ఫలితాలు విడుదల

కొత్తగూడెం సింగరేణి, న్యూస్‌టుడే: సింగరేణిలో ఏడు విభాగాల్లో 327 ఖాళీలను భర్తీ చేసేందుకు ఈనెల 6, 7 తేదీల్లో నిర్వహించిన ఆన్‌లైన్ పరీక్షల ఫలితాల ప్రొవిజినల్ మెరిట్‌లిస్టును యాజమాన్యం మంగళవారం విడుదల చేసింది. 09 అసిస్టెంట్‌ఫోర్మెన్ ట్రైనీ, 100 జూనియర్ మైనింగ్ ఇంజినీర్ ట్రైనీ, 98 ఎలక్ట్రీషియన్ ట్రైనీ, 47 ఫిట్టర్‌ట్రైనీ అభ్యర్థులకు 6వ తేదీన, 42 మేనేజ్‌మెంట్‌ట్రైనీ(ఈ.ఎం.), 07 మేనేజ్‌మెంట్ ట్రైనీ(సిస్టమ్స్), 09 అసిస్టెంట్ ఫోర్మెన్ ట్రైనీ(మెకానికల్) ఉద్యోగాలకు ఆన్‌లైన్ పరీక్షలను నిర్వహించిన విషయం తెలిసిందే. వీటి ఫలితాల(ప్రొవిజినల్ మెరిట్ జాబితా)ను సింగరేణి వెబ్‌సైట్‌లో పొందుపర్చారు.

17 నుంచి కారుణ్య నియామకాలు

ఖమ్మం కమాన్‌బజార్, న్యూస్‌టుడే: టీజీఎస్ ఆర్టీసీ ఖమ్మం రీజియన్‌లో ఈనెల 17, 18 తేదీల్లో ఖమ్మం నూతన బస్టాండ్‌లో ఉదయం 10 గంటల నుంచి కారుణ్య నియామకాలు చేపట్టనున్నట్లు ఆర్‌ఎం సరిరాం మంగళవారం ప్రకటించారు. రీజియన్‌లో మొత్తం 66 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. బ్రెడ్ విన్నర్ స్కీం-43, మెడికల్ రిటైర్‌మెంట్ స్కీం-23 కింద ఈ నియామకాలు చేపట్టనున్నట్లు వివరించారు. కాల్ లెటర్స్ అందిన అభ్యర్థులు సకాలంలో హాజరు కావాలని సూచించారు.

సారపాక విద్యార్థిని ప్రతిభ



సుజిత

బూర్గంపాడు, న్యూస్‌టుడే: బూర్గంపాడు మండలం సారపాకకు చెందిన మాడుగుల సుజిత ప్రభుత్వ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించారు. నరసింహారావు-రమాదేవి దంపతుల కుమార్తె సుజిత నీట్ పరీక్షల్లో సత్తా చాటారు. ఇటీవల నిర్వహించిన కౌన్సెలింగ్‌లో జయశంకర్ భూపాలపల్లి ప్రభుత్వ వైద్య కళాశాలలో సీటు సాధించారు. పదో తరగతి వరకు స్థానికంగా చదివిన ఈమె ఇంటర్మీడియట్ ఖమ్మంలో చదివారు. ప్రతిభ చాటి ప్రభుత్వ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించిన విద్యార్థినిని స్థానికులు అభినందించారు.

గంజాయి ముఠా గుట్టురట్టు

◆ ఆరుగురి అరెస్ట్, 11 మందిపై కేసు నమోదు



పట్టుబడిన గంజాయితో ఏసీపీ ఎ.రఘు, సీఐ టి.కిరణ్, సిబ్బంది

సత్తుపల్లి, న్యూస్‌టుడే: సత్తుపల్లి పోలీసులు గంజాయి రాకెట్ గుట్టురట్టు చేశారు. కేసుకు సంబంధించిన వివరాలను స్థానిక ఠాణాలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కల్లూరు ఏసీపీ ఎ.రఘు వెల్లడించారు. సత్తుపల్లి మండలం కిష్టారానికి చెందిన పాశం వెంకటశివరామకృష్ణ అలియాస్ పండు, కువ్వారపు నితిన్‌కుమార్, రామాల కార్తీక్, పాలకుర్తి రాజేశ్‌లతోపాటు సత్తుపల్లిలోని ద్వారకాపురికాలనీకి చెందిన కొమ్ము మనోవర్ధన్ అలియాస్ మను, ఏపీలోని ఏలూరు జిల్లా జనార్దనవరం గ్రామానికి చెందిన కొత్తపల్లి రత్నబాబులు నాలుగు కిలోల గంజాయిని కారు, రెండు ద్విచక్ర వాహనాల్లో అక్రమంగా సత్తుపల్లికి తరలిస్తుండగా సోమవారం మండల పరిధిలోని మేడిశెట్టివారిపాలెం అడ్డరోడ్డు వద్ద పోలీసులు పట్టుకున్నారు. పాశం వెంకటశివరామకృష్ణ సత్తుపల్లిలోని ఎండీ ఆసుపత్రి రోడ్డులో ఉంటున్న ఆరుమళ్ల తరుణ్‌కుమార్, వేల్పుల పుల్లారావు, మనోవర్ధన్‌తో కలిసి 20 రోజుల క్రితం ఏపీలోని ఏలూరు జిల్లా చింతలపూడి మండలం సీతానగరంలో ఓ ద్విచక్రవాహనాన్ని చోరీ చేశారు. దీంతో పాటు మరో బైక్ సాయంతో ఒడిశా రాష్ట్రంలోని ఆవులపాకకు చెందిన భగవాన్ దగ్గరకు వెళ్లి మూడు కిలోల గంజాయిని కొనుగోలు చేశారు. తాము కొంత వినియోగించుకుని మిగిలిన దాన్ని చిన్న పొట్లాలుగా చేసి రూ.500చొప్పున విక్రయించారు. అందులో అర కిలో గంజాయిని సత్తుపల్లిలోని వెలిశాల వినయ్, తాళ్లమడకు చెందిన నున్నా నవీన్‌లకు అమ్మినట్లు వెంకటశివరామకృష్ణ చెప్పడంతో వారిని కూడా అదుపులోకి తీసుకున్నారు. పది రోజుల క్రితం ఒడిశా నుంచి గంజాయిని తీసుకొస్తూ పోలీస్ తనిఖీల దృష్ట్యా భద్రాచలంలో దాచారు. అనంతరం సత్తుపల్లికి తరలిస్తూ సోమవారం పట్టుబడటంతో విషయం వెలుగులోకి వచ్చింది.

82 మందికి విక్రయం..: గంజాయితో పట్టుబడిన వ్యక్తులు ఇప్పటివరకు 82 మందికి విక్రయించినట్టు విచారణలో తేలిందని ఏసీపీ వివరించారు. ఇందులో 71 మంది మేజర్లు ఉండగా మరో 11 మంది మైనర్లున్నారని, ఇంకా కేసు విచారణ సాగుతోందని చెప్పారు. పైన పేర్కొన్న 11మందిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పర్చగా న్యాయస్థానం రిమాండ్ విధించిందని తెలిపారు. దాడుల్లో కారు, రెండు ద్విచక్ర వాహనాలు, ఐదు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. మొత్తం రూ.1,46,125 విలువైన 5.845 కిలోల గంజాయిని సీజ్ చేశారు. సీఐ టి.కిరణ్, వేంసూరు ఎస్సై ఎస్.వీరప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు. కేసును ఛేదించిన సీఐ, ఎస్సై, సిబ్బందిని సీపీ సునీల్‌దత్ అభినందించారు.

కేటీపీఎస్ బొగ్గు వ్యాగన్‌లో మృతదేహం



మాడిల్స్‌లో మృతదేహం



అనాథలుగా మారిన చిన్నారులు

పాల్వంచ, న్యూస్‌టుడే: పాల్వంచ కేటీపీఎస్ అయిదో దశకు రవాణా చేసే బొగ్గువ్యాగన్‌లో మంగళవారం తెల్లవారుజామున మృతదేహం లభ్యమవటం కలకలం రేపింది. మృతుడు సుజాతనగర్ మండలం సీతంపేటకు చెందిన గుగులోత్ రమేశ్(35)గా గుర్తించారు. కొత్తగూడెం రుద్రంపూర్ నుంచి వ్యాగన్ బొగ్గు లోడుతో రావడంతో దిగుమతి చేసుకొనే క్రమంలో మాడిల్స్‌లో వేసిన బొగ్గు కిందికి రాకపోవడంతో సంబంధిత ఉద్యోగులు గ్రిడ్‌లో చూస్తే మృతదేహం కనిపించింది. కర్మాగారం సీఈ మేక ప్రభాకర్‌రావు, ఎస్ఈ కృష్ణ, రైల్వే అధికారులతో పాటు పట్టణ పోలీసులకు సమాచారం చేరవేశారు. మృతదేహాన్ని ఆసుపత్రికి తీసుకొచ్చి శవపరీక్ష నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేటీపీఎస్ అధికారుల ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు.

రెండు నెలల వ్యవధిలో దంపతుల మృతి: హైదరాబాద్ వెళ్తానని మూడు రోజుల క్రితం ఇంటి నుంచి బయటకొచ్చిన వ్యక్తి అనూహ్యంగా పాల్వంచ కేటీపీఎస్ విద్యుత్కేంద్రంలో శవమై కనిపించటంతో సీతంపేటలో విషాదఛాయలు అలుముకున్నాయి. వివరాల్లోకి వెళ్తే.. గుగులోత్ రమేశ్ భార్య దివ్య రెండు నెలల క్రితమే ఆరోగ్య సమస్యతో చనిపోయారు. తాజాగా రమేశ్ మృతదేహం లభ్యమైంది. రమేశ్‌కు కుమార్తె భవాని(7) తనయుడు సాయిమణికంఠ(5) ఉన్నారు. తల్లిదండ్రులిద్దరూ రెండు నెలల వ్యవధిలో మరణించడంతో చిన్నారులు అనాథలుగా మారారు. రమేశ్ తండ్రి బిచ్చ లేరు. తల్లి చంద్రి వృద్ధురాలు. అతడి సోదరుడు రవికుమార్ దివ్యాంగుడు కావడంతో చిన్నారుల ఆలనాపాలనా ప్రశ్నార్థకంగా మారింది.

టికెట్ బుకింగ్‌కు కొత్త వెబ్‌సైట్

ఖమ్మం కమాన్‌బజార్, న్యూస్‌టుడే: తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణ సంస్థ టికెట్ బుకింగ్‌కు కొత్త వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు ఖమ్మం రీజినల్ మేనేజర్ సరిరాం తెలిపారు. గతంలో ఉన్న వెబ్‌సైట్ స్థానంలో www.tgsrtcbus.in ను కొత్తగా ప్రవేశపెట్టినట్లు వివరించారు. ప్రయాణికులు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.

12న ఆయిల్‌పామ్ కర్మాగారంలో పవర్ ప్లాంట్ ప్రారంభం



సమావేశంలో మాట్లాడుతున్న ఆళ్లపాటి రామచంద్రప్రసాద్

సత్తుపల్లి, న్యూస్‌టుడే: భద్రాద్రి జిల్లా అశ్వారావుపేట ఆయిల్‌పామ్ కర్మాగారంలో రూ.33 కోట్లతో నిర్మించిన 2.5 మెగావాట్ల పవర్ ప్లాంట్‌ను ఈ నెల 12న ప్రారంభిస్తున్నట్లు తెలంగాణ పామాయిల్ ఫార్మర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆళ్లపాటి రామచంద్రప్రసాద్ తెలిపారు. స్థానిక కాకర్లపల్లి రోడ్డులో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ప్లాంటును ప్రారంభిస్తారన్నారు. ఇటీవల తుమ్మల నాగేశ్వరరావు వినతితో దిగుమతి సుంకం పెంచిన క్రమంలో పామాయిల్ గెలలు టన్ను రూ.17వేల నుంచి రూ.18వేల వరకు పెరిగాయని, తుమ్మలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. 12న ఐఓపీఆర్ శాస్త్రవేత్తలతో నిర్వహించే సదస్సునూ రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆయిల్‌ఫెడ్ డివిజన్ అధికారి బాలకృష్ణ, ఫైనాన్స్ సెక్రటరీ రాధాకృష్ణ, సొసైటీ జాయింట్ సెక్రటరీ బండి గుర్వారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

జాతరకు ముస్తాబు..

తరలిరానున్న ఉత్తర తెలంగాణ భక్తులు

కారేపల్లి, న్యూస్‌టుడే

రాష్ట్రంలో పెద్దజాతరగా పేరొందిన కారేపల్లి మండలం ఉసిరికాయలపల్లి శ్రీకోటమైసమ్మ జాతర ముస్తాబైంది. దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని ఐదు రోజులపాటు అంగరంగ వైభవంగా జరిగే వేడుక ఈనెల 12 నుంచి ప్రారంభంకానుంది. ఇప్పటికే దేవాదాయ శాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ప్రతీ ఏడాది ఉమ్మడి ఖమ్మం, వరంగల్, నల్గొండ, కరీంనగర్ జిల్లాల నుంచి వేల సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకోవడం ఆనవాయితీ. ఈ జాతరలో వాహన పూజలకు సైతం ప్రత్యేకత ఉండటంతో దసరా పండుగ రోజున వేల వాహనాలు పూజల కోసం వస్తాయి.





ఏర్పాటు చేసిన వినోదాన్ని పంచే యంత్రాలు

ఇతర రాష్ట్రాల నుంచి యంత్రాలు

జాతరలో అమ్మవారిని దర్శించుకున్న అనంతరం వినోదాన్ని పంచే యంత్రాల వద్దనే అసలు సందడి నెలకొని ఉంటుంది. జెయింట్‌వీల్స్, డ్రాగన్ ట్రైన్, సొలాంబో, బ్రేక్‌డ్యాన్స్, బైక్‌రేస్, పడవ, జంతు ప్రదర్శనశాలతోపాటు పలు రకాల వినోద యంత్రాలను ఇప్పటికే అమర్చారు. మధ్యప్రదేశ్, గుజరాత్, మహారాష్ట్ర నుంచి ఈ యంత్రాలను తీసుకువచ్చారు.

వందల సంఖ్యలో పోలీసు బందోబస్తు

ఇసుక వేస్తే రాలనంత జనంతో కిక్కిరిసిపోయే మహా జాతరలో మొదటి మూడు రోజులు ట్రాఫిక్ నియంత్రణ పోలీసులకు పెద్దసవాల్‌గా మారుతోంది. ఇందులో భాగంగా పది మంది ఎస్సైలు, ఐదుగురు సీఐలతోపాటు వంద మంది వరకు పోలీసులు బందోబస్తు నిర్వహించనున్నారు. వాహన రాకపోకలు సమస్య అవుతుండటంతో ఈ ఏడాది ఆల్యాతండా సమీపంలో ఖాళీస్థలంలో వాహనాల పార్కింగ్‌కు స్థలం కేటాయించారు.

చికెన్ ధరలు	వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -120 రిటైల్ ధర 142 చికెన్ విత్ స్కిన్ - 206, చికెన్ స్కిన్‌లెస్ - 234.

భద్రాచలం

• భద్రాచలం • పినపాక • అశ్వారావుపేట

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి

దమ్మపేట, న్యూస్‌టుడే: మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఆకాంక్షించారు. మండల కేంద్రంలో స్వయంసహాయక సంఘాలకు బ్యాంకులింకేజీ ద్వారా మంజూరైన రూ.5.78కోట్ల విలువైన యూనిట్లను ఆయన మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలోని అన్ని సంఘాలకు రూ.30కోట్ల నిధులను ప్రభుత్వం కేటాయించిందన్నారు. మహిళలు ఈ నిధులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. తొలి విడతగా 57 గ్రామాల్లోని 1333 సంఘాలకు పాడిపరిశ్రమ, మీసేవ కేంద్రాలు, కుట్టుమిషన్లు, పెరటికోళ్ల పెంపకం, ఫుడ్‌కోర్టు తదితర యూనిట్ల ఏర్పాటుకు ఈ నిధులను మంజూరు చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో ఏపీఎం నాగేశ్వరరావు, సీసీలు, కాంగ్రెస్ నాయకులు ప్రసాద్, నర్సి, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



డ్వాక్రా మహిళలకు చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

బెస్ట్ అవైలబుల్ పథకానికి ధ్రువపత్రాలు సమర్పించండి

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: 2024-25 బెస్ట్ అవైలబుల్ పథకానికి అర్హులైన 6, 7, 8, 9 తరగతుల విద్యార్థులు తమ ధ్రువీకరణ పత్రాలు ఈనెల 20లోపు జతపరచాలని భద్రాచలం ఐటీడీఏ పీఓ రాహుల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ తరగతుల్లో మొత్తం 38 సీట్లను ఈనెల 22న లాటరీ ద్వారా భర్తీ చేస్తారని వెల్లడించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన విద్యార్థులే అర్హులని, వారి కుల, నివాస, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు గిరిజన సంక్షేమశాఖ ఐటీడీఏ భద్రాచలం కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

ఎక్సైజ్ పోలీసుల దాడులు.. ఇద్దరిపై కేసు నమోదు

ఈనాడు కథనానికి స్పందన

పినపాక, న్యూస్‌టుడే: పినపాక మండలంలోని పలు ప్రాంతాల్లో ఎక్సైజ్ పోలీసులు మంగళవారం దాడులు నిర్వహించారు. మండల వ్యాప్తంగా సారా తయారీ, విక్రయాలు అధికంగా జరుగుతున్న నేపథ్యంలో 'విచ్చలవిడిగా నాటుసారా విక్రయాలు' అనే శీర్షికన 'ఈనాడు'లో మంగళవారం వెలువడిన కథనానికి సీఐ రాజిరెడ్డి స్పందించారు. సిబ్బందితో కలిసి కలవలనాగారంలో దాడులు నిర్వహించారు. ద్విచక్రవాహనంపై తరలిస్తున్న 9 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసి వాహనాన్ని సీజ్ చేశారు. పోతురెడ్డిపల్లిలో విప్పసారా విక్రయిస్తున్న ఓ మహిళ వద్ద 2 లీటర్ల సారాను గుర్తించి కేసు నమోదు చేసి బైండోవర్ చేసినట్లు సీఐ తెలిపారు. గుడుంబా విక్రయాలు చేపడితే కేసులతోపాటు రూ.లక్ష మేర జరిమానా విధిస్తామన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.



నాటుసారా తరలిస్తూ పట్టుబడిన వ్యక్తితో ఎక్సైజ్ పోలీసులు

పేదల బియ్యం.. అక్రమార్కుల పరం..!

సరిహద్దులు దాటిస్తూ యథేచ్ఛగా దందా

దుమ్ముగూడెం, న్యూస్‌టుడే

దారిద్ర్యరేఖకు దిగువనున్న నిరుపేదల సంక్షేమం కోసం ప్రభుత్వం సరఫరా చేస్తున్న రేషన్ బియ్యం పక్కదారి పడుతోంది. నిరుపేదలకు అందాల్సిన బియ్యాన్ని అడ్డదారిలో కొందరు అక్రమార్కులు బొక్కేస్తున్నారు. ప్రతినెలా లక్షలాది రూపాయల విలువైన బియ్యం భద్రాచలం మన్యం ప్రాంతం నుంచి ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు అధికారుల అసమర్థత, అక్రమార్కుల అవినీతి కారణంగా తరలిపోతోంది.



రైస్‌మిల్లులో పట్టుబడిన రేషన్ బియ్యం (పాత చిత్రం)

కిలో రూ.10 చొప్పున కొని..

భద్రాచలం మన్యం ప్రాంతంలోని దుమ్ముగూడెం, చర్ల, భద్రాచలం, బూర్గంపాడు, మణుగూరు, అశ్వాపురం, టేకులపల్లి వంటి తదితర మండలాల నుంచి రేషన్ బియ్యం అక్రమ వ్యాపారం జోరుగా సాగుతోంది. ప్రతి మండలానికి దాదాపు 8 వేల నుంచి 13వేల తెల్ల రేషన్ కార్డులు ఉన్నాయి. వీటికి సంబంధించి ప్రతినెలా ఒక్కో చౌకధరల దుకాణానికి దాదాపు 25 క్వింటాళ్ల నుంచి 100 క్వింటాళ్ల వరకు బియ్యాన్ని ప్రభుత్వం కేటాయిస్తోంది.

అయితే ఈ దుకాణాలకు సరఫరా చేస్తున్న బియ్యం లావుగా ఉండడంతో వినియోగదారులు తినేందుకు అంతగా ఆసక్తి చూపడంలేదు. ఇది కొందరు అక్రమార్కులకు వరంగా మారింది. అలాంటి వినియోగదారుల నుంచి గ్రామాల్లో నియమించుకున్న తమ ఏజెంట్ల సాయంతో కిలో రూ.10 చొప్పున ఆ బియ్యాన్ని సేకరిస్తున్నారు. ఆ బియ్యాన్ని రాత్రిళ్లు ఆటోలు, తదితర వాహనాల్లో గుట్టుచప్పుడు కాకుండా ఛత్తీస్‌గఢ్, ఆంధ్రా ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఇంకొందరు రేషన్ బియ్యాన్ని మళ్లీ రీపాలిష్ చేసి సన్నబియ్యంలో కలిపేయడం లేదా 25 కిలోల బ్యాగుల్లో మళ్లీ మార్కెట్ ధరకు అమ్మడం చేస్తున్నారు. కొన్ని చోట్ల రేషన్ బియ్యాన్ని చేపలకు దాణాకూ చెరువుల యజమానులకు విక్రయిస్తున్నారు.

చర్యలు చేపడతాం: రాజులు, పౌరసరఫరాల డీటీ

అక్రమంగా రేషన్ బియ్యం తరలిపోకుండా నిఘా పెంచుతాం. వాటిని నిల్వ చేసిన ప్రదేశాల గురించి సమాచారం మా దృష్టికి తెస్తే వెంటనే దాడులు చేస్తాం. తనిఖీల్లో దొరికిన వాహనాలతో పాటు బియ్యాన్నీ స్వాధీనం చేసుకొని బాధ్యులపై 6ఏ కేసులు నమోదు చేస్తున్నాం.

అప్పుడప్పుడూ పట్టుకుంటూ..

ఈ దందాపై అధికారులూ కమీషన్లకు కక్కుర్తిపడి చూసీచూడనట్లు వదిలేస్తున్నారన్న తీవ్ర విమర్శలు బాహాటంగానే వినిపిస్తున్నాయి. అప్పుడప్పుడు కొందరు అధికారులు తూతూమంత్రంగా కేసులు నమోదుచేసి చేతులు దులుపుకుంటున్నారన్న వ్యాఖ్యలూ ఉన్నాయి.

✦ ఏపీలోని చింతూరు మండలానికి ఏడాది కిందట అక్రమంగా ఓ బొలెరో వాహనంలో రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా అది బోల్తాపడి దుమ్ముగూడెం మండలం కాటాయిగూడెంకు చెందిన ఓ గిరిజనుడు మృతి చెందాడు.

✦ దుమ్ముగూడెం మండలంలో ఓ రైసుమిల్లులో నిల్వ చేసిన దాదాపు 350 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. నెల రోజుల కిందట రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న చింతూరు మండలానికి చెందిన ఓ వ్యాపారిపై దుమ్ముగూడెం పోలీస్‌స్టేషన్‌లో కేసులు నమోదు చేశారు.

దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలి

గుండాల, న్యూస్‌టుడే: దివ్యాంగుల అవసరాల కోసం యంత్ర పరికరాలు సద్వినియోగం చేసుకోవాలని మహిళా, శిశు, దివ్యాంగులు, వృద్ధుల జిల్లా సంక్షేమ శాఖ అధికారి వేల్పుల విజేత అన్నారు. మంగళవారం గుండాలలో సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన దివ్యాంగులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
భద్రాచలం: 79950 67029
అశ్వారావుపేట: 80085 73696
పినపాక: 91212 29033

సమస్య: భద్రాచలంలోని చర్ల రోడ్‌లో ఉన్న చికెన్, మాంసం దుకాణాల్లో తూకాల్లో తక్కువ వస్తోంది. సంబంధిత అధికారులు దీనిపై పరిశీలించి కాటాలు సక్రమంగా లేని వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను. - **కిరణ్, భద్రాచలం**

సమాధానం: తూకంలో వినియోగదారులను మోసగించడం నేరం. త్వరలో తనిఖీలు చేపట్టి తూకంలో తేడా వస్తే చర్యలు తీసుకుంటాం. - **మనోహర్, జిల్లా తూనికల కొలతల అధికారి**

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే

పైపులైను లీకేజీకి మరమ్మతులు

స్పందనకు వందనం

అశ్వారావుపేట, న్యూస్‌టుడే: అశ్వారావుపేట పట్టణంలోని యూబీఐ ఎదురుగా నీళ్ల పైపులైను లీకేజీపై 'మేమున్నాం మీకు తోడుగా'లో మంగళవారం ప్రచురితమవడంతో పంచాయతీ కార్యదర్శి కె.శ్రీరామ్మూర్తి స్పందించారు. లీకేజీని అరికట్టి సమస్య పరిష్కరించారు.

★ దుమ్ముగూడెం, న్యూస్‌టుడే: లక్ష్మీనగరం సూపర్ మార్కెట్ సెంటరులో తాగునీటి గేట్ వాల్వు ఏర్పాటుకు తీసిన గొయ్యి ప్రమాదకరంగా మారింది. దీనిపై 'మేమున్నాం మీకుతోడుగా'లో ప్రచురితమవడంతో పంచాయతీ కార్యదర్శి అనూష స్పందించారు. గొయ్యి పూడ్చివేతకు చర్యలు చేపట్టారు.

వీధిదీపాల ఏర్పాటు

ఆళ్లపల్లి, న్యూస్‌టుడే: బోడాయికుంట గ్రామంలో వీధిదీపాలు ఏర్పాటు చేయలేదని మహిళలు, యువతులు, చిన్నారులు బతుకమ్మ ఆటపాటలు చీకట్లోనే ఆడాల్సి వస్తుందని ఈనెల 7న 'మేమున్నాం మీకు తోడుగా'లో ప్రచురితం కావడంతో పంచాయతీ కార్యదర్శి అనురాధ స్పందించారు. మంగళవారం బోడాయికుంటలో వీధిదీపాలు ఏర్పాటు చేయించారు.

పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా దశమ్‌బాబు



కారంపూడి దశమ్‌బాబు

దుమ్ముగూడెం, న్యూస్‌టుడే: పీఆర్‌టీయూ తెలంగాణ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడుగా కారంపూడి దశమ్‌బాబు ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర 35వ కౌన్సిల్ సమావేశంలో ఆయనను ఎన్నుకున్నారు. ఆయన వైట్‌నాగారం ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆయనకు సంఘ నాయకులు పలువురు అభినందనలు తెలిపారు.

ఉపాధ్యక్షుడిగా చందూనాయక్: బూర్గంపాడు, న్యూస్‌టుడే: బూర్గంపాడు మండలం ఉప్పుసాక యూపీఎస్‌లో ఎస్‌జీటీగా పని చేస్తున్న చందూనాయక్ పీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఆయనను ఉపాధ్యాయులు, పీఆర్‌టీయూ నాయకులు అభినందించారు.

జడ్పీ పాఠశాలకు నిధులు మంజూరు

మణుగూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: మణుగూరు సమితిసింగారంలోని జడ్పీ ఉన్నత పాఠశాల అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రత్యేక నిధులు మంజూరు చేశారని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు పీర్నాకి నవీన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్వో ప్లాంటు ఏర్పాటుకు రూ.10 లక్షలు, వాకింగ్ ట్రాక్ నిర్మాణానికి రూ.10 లక్షలు కేటాయించారన్నారు.

ఆడపడుచులకు వెసులుబాటు కల్పించాలని వినతి

మణుగూరు పట్టణం, న్యూస్‌టుడే: పీవీకాలనీలోని భద్రాద్రి క్రీడా మైదానంలో ఈనెల 10న నిర్వహించే సద్దుల బతుకమ్మ ఉత్సవాలకు మణుగూరు ఏరియాలో పనిచేసే సింగరేణి మహిళాఉద్యోగులకు సమయ వేళల్లో వెసులుబాటు కల్పించాలని కోరుతూ తెబొగకాసం ఆధ్వర్యంలో ఏరియా ప్రత్యేక అధికారి శ్యాంసుందర్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు.

శిశువు వైద్యానికి సాయం

చర్ల, న్యూస్‌టుడే: విజయకాలనీకి చెందిన ట్రాక్టర్ డ్రైవరు పసల నవీన్ దంపతులకు జన్మించిన బిడ్డకు పుట్టుకతోనే అనారోగ్యంతో జన్మించింది. ఈ దంపతులు పేదలు కావడంతో బిడ్డ వైద్య ఖర్చులకు దాతల ద్వారా 'మీకోసం మేమున్నాం' సహాయ సమితి రూ.20వేలు సేకరించింది. ఆ నగదును ఉపాధ్యాయురాలు ఇర్పా అనుసూయ చేతులమీదుగా మంగళవారం బాధిత కుటుంబానికి అందజేశారు. సమితి ఛైర్మన్ నీలి ప్రకాశ్, దొడ్డా ప్రభుదాసు, సరెం సమ్మయ్య, దొడ్డి సూరిబాబు, సందీప్, ప్రతాప్, పున్నం శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఏపీ ట్రైకార్ ఛైర్మన్‌ను కలిసిన తెదేపా నాయకులు

దమ్మపేట, న్యూస్‌టుడే: ఏపీ ట్రైకార్ ఛైర్మన్‌గా నియమితులైన బొరగం శ్రీనివాస్‌ను ఏలూరు జిల్లా బుట్టాయిగూడెం గ్రామంలోని ఆయన నివాసంతో అశ్వారావుపేట నియోజకవర్గ తెదేపా నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఆయనకు శాలువా కప్పి సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు కట్రం స్వామి, దమ్మపేట, వలీపాష, నార్లపాటి శ్రీనివాసరావు, కట్టం ఎర్రప్ప, కీసరి లక్ష్మణరావు, నాని తదితరులు పాల్గొన్నారు.

చంద్రుగొండ ఎస్‌ఐకి రజత పతకాలు

చంద్రుగొండ: వరంగల్‌లో మంగళవారం జరిగిన డ్యూటీ మీట్‌లో చంద్రుగొండ ఎస్‌ఐ గంజి స్వప్న కమిషనర్ అంబర్ కిషోర్ ఝా చేతుల మీదుగా రెండు రజత పతకాలు అందుకున్నారు. కొన్ని కేసుల్లో ఆమె పరిశోధనకు గుర్తింపుగా ఈ పతకాలు లభించాయి. ఆమెకు పలువురు పోలీస్ సిబ్బంది అభినందనలు తెలిపారు.



తాలిపేరు చెంత.. మల్చింగ్ పరదా..!



చర్ల మండలంలోని గొంపెనగూడెం సమీపంలో తాలిపేరు పరీవాహకంలో రైతులు మిరప సాగు చేస్తున్నారు. కలుపు రాకుండా వేసిన మల్చింగ్ పేపర్‌ను దూరం నుంచి చూస్తే తాలిపేరుకు వరదొచ్చిందా అన్నట్లు కనిపిస్తోంది. దగ్గరగా వెళితే మల్చింగ్ పరదా నిండుగా కనిపిస్తోంది. – చర్ల, న్యూస్‌టుడే

జన సందడితో బతుకమ్మ గద్దెలు

అశ్వారావుపేట, న్యూస్‌టుడే: 'చిత్తూ చిత్తూల బొమ్మ.. శివునీ ముద్దూలగుమ్మా' అంటూ ఆటపాటలతో అశ్వారావుపేటలో బతుకమ్మ గద్దెలు జనంతో సందడిగా మారాయి. పట్టణంలో రామాలయం, షిర్డీ సాయిబాబా మందిరం, కనకదుర్గా అమ్మవారి ఆలయం, నాయిబ్రాహ్మణ వీధి, గౌడబజారుల్లో మంగళవారం ఏర్పాటు చేసిన బతుకమ్మల గద్దెల వద్దకు భారీగా జనం రావడంతో ఆ ప్రాంతాలు కిక్కిరిశాయి. పట్టణంలో పది ప్రాంతాల్లో బతుకమ్మల గద్దెలు ఏర్పాటు చేశారు.

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: ఐటీడీఏలో పనిచేసే మహిళా ఉద్యోగులు, పీఓ సతీమణి మనీషా మంగళవారం బతుకమ్మ వేడుకల్లో పాల్గొని సందడి చేశారు. ఐటీడీఏలో రంగురంగుల పూలతో అందంగా తీర్చిదిద్దిన బతుకమ్మలను ఓచోట ఏర్పాటు చేసి తులసి పూజ, ఆటపాటలతో అలరించారు. బతుకమ్మ పండుగ విశిష్టతను తెలిపారు. డీడీ మణెమ్మ, పలువురు మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.



మణుగూరు సాంస్కృతికం: శివలింగాపురం పీహెచ్‌సీలో బతుకమ్మ వేడుకలో పాల్గొన్న వైద్యులు, సిబ్బంది

మణుగూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: మణుగూరులోని శివలింగాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం బతుకమ్మ సంబరాన్ని నిర్వహించారు. ఆసుపత్రిలో పని చేస్తున్న వైద్యులు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు బతుకమ్మలను పేర్చి పాటలు పాడుతూ ఆటలు ఆడుతూ సందడి చేశారు. మండల వైద్యాధికారి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అఖిల జగాలకు.. అమ్మవు నీవే..!



అశ్వారావుపేట గ్రామీణం: శ్రీరంగాపురం శ్రీవిజయదుర్గా అమ్మవారి ఆలయంలో బతుకమ్మలతో భక్తులు

భద్రాచలం, న్యూస్‌టుడే: సర్వ జగాలకు ఆహారాన్ని అందించే అమ్మ ధాన్యలక్ష్మి. మంగళవారం ఈ రూపంలో ఉన్న మాతకు భక్తులు ప్రత్యేక పూజలు చేసి ప్రణమిల్లారు. నీ దయ మా మీద చూపించు తల్లీ అంటూ వేడుకున్నారు. దసర మహోత్సవాలలో భాగంగా ఐదో రోజైన మంగళవారం భద్రాచలం రామాలయంలో సందడి నెలకొంది. ఈ ప్రాంగణంలో ఉన్న లక్ష్మీతాయారు అమ్మవారిని దర్శించి కానుకలు సమర్పించారు. ధాన్యలక్ష్మిగా అలంకరించారు. సామూహికంగా కుంకుమార్చన నిర్వహించారు. విశ్వం సుభిక్షంగా వర్ధిల్లాలని వేడుకున్నారు. బుధవారం అమ్మవారు విజయలక్ష్మీ అలంకారంలో దర్శనమిస్తారు.

దమ్మపేట: మండలంలోని పలు గ్రామాల్లోని ఆలయాల్లో శ్రీమహాలక్ష్మీదేవి అలంకారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. దమ్మపేటలోని పాల్వంచ ప్రధానరహదారిలో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపం వద్ద మహా అన్నసంతర్పణ కార్యక్రమంలో ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పాల్గొన్నారు.

అశ్వారావుపేట: అశ్వారావుపేటలోని కనకదుర్గా అమ్మవారు కాత్యాయనీ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో మాంగల్య గౌరీదేవి అలంకారంలో అలరించారు. అభిషేకాలు, కుంకుమ పూజలు, సాగాయి.

అన్నపురెడ్డిపల్లి: శ్రీబాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద శ్రీఐశ్వర్యలక్ష్మి రూపంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. గ్రామాల్లో కొలువుదీరిన అమ్మవార్లకు మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మహాలక్ష్మి రూపంలో.. దుమ్ముగూడెం, న్యూస్‌టుడే: దశరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా పర్ణశాల, సీతారాంపురం, నడికుడి ఆలయాల్లో అమ్మవారిని మహాలక్ష్మిగా మంగళవారం అలంకరించారు.

అశ్వారావుపేట గ్రామీణం: శ్రీరంగాపురం శ్రీవిజయదుర్గా అమ్మవారి ఆలయం వద్ద బతుకమ్మ సంబురాలు సాగాయి. పలు గ్రామాల్లోని ఆలయాల వద్ద సామూహిక కుంకుమార్చన నిర్వహించారు.

మణుగూరు పట్టణం, బూర్గంపాడు, మణుగూరు సాంస్కృతికం, కరకగూడెం, న్యూస్‌టుడే: మణుగూరు ఓసీ గని ఆవరణలో కొలువైన కనకదుర్గా మైసమ్మ అమ్మవారిని జీఎం దుర్గం రామచందర్ మంగళవారం దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ★ బూర్గంపాడు మండలం సారపాకతోపాటు నాగినేనిప్రోలు రెడ్డిపాలెం, బూర్గంపాడు, మోరంపల్లి బంజర, లక్ష్మీపురం తదితర సామూహిక కుంకుమార్చనలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పలు మండపాల్లో అన్నదానాలు కొనసాగాయి.

★ కరకగూడెం రామాలయం, భట్టుపల్లి సమీపంలోని రాళ్లవాగు వద్ద దశమి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గాదేవి ఆరవ రోజున మహాలక్ష్మిగా మంగళవారం దర్శనమిచ్చారు.



భద్రాచలం: ధాన్యలక్ష్మి అలంకారంలో అమ్మవారు



అశ్వారావుపేట గ్రామీణం: మామిళ్లవారిగూడెంలో..

బతుకమ్మలతో సందడి: చంద్రుగొండ: చంద్రుగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం వైద్యసిబ్బంది బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. వైద్యులు తనూజ, వెంకటక్రిష్ణ ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది బతుకమ్మ ఆడారు. ఏడాదికి ఒకసారి జరిగే బతుకమ్మ సంబురాల్లో వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



చంద్రుగొండ పీహెచ్‌సీలో బతుకమ్మలతో..

పురుగుమందు తాగి వ్యక్తి ఆత్మహత్య

దమ్మపేట, న్యూస్‌టుడే: పురుగుమందు తాగి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన దమ్మపేటలో చోటు చేసుకుంది. పోలీసులు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గొల్లపల్లి సత్యనారాయణ(61) మద్యానికి బానిసయ్యాడు. రోజూ మద్యం తాగి వస్తుండటంతో భార్య, కుమారుడు మందలించారు. దీంతో సత్యనారాయణ క్షణికావేశంలో సోమవారం పురుగుమందు తాగాడు. కుటుంబ సభ్యులు హుటాహుటిన ఖమ్మం వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఎస్సై బాల స్వామినాథన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసుపై డీఎస్పీ విచారణ

చంద్రుగొండ, న్యూస్‌టుడే: చంద్రుగొండ మండలంలోని ఓ గ్రామానికి చెందిన దళిత మహిళను మాయమాటలు చెప్పి ఓ వ్యక్తి లొంగదీసుకొని అనంతరం కులం పేరుతో దూషించిన కేసుపై మంగళవారం రాత్రి కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ విచారణ జరిపారు. పోలీసుల కథనం ప్రకారం.. బెండాలపాడు గ్రామానికి చెందిన లారీడ్రైవర్ హమీద్ 32 ఏళ్ల మహిళను రెండు నెలల కిందట లొంగదీసుకొని పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడు. అనంతరం కులం పేరుతో దూషిస్తూ వేధింపులకు గురిచేశాడు. బాధిత మహిళ ఫిర్యాదు మేరకు పోలీసులు ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఈ కేసుపై డీఎస్పీ రెహమాన్ విచారణ చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

అశ్వాపురం, న్యూస్‌టుడే: అశ్వాపురం ప్రధాన రహదారిపై నడుచుకుంటూ వెళ్తున్న మణుగూరుకు చెందిన మంగమ్మను ఎదురుగా వచ్చిన ఓ ద్విచక్ర వాహనం మంగళవారం ఢీకొంది. మంగమ్మకు, ద్విచక్ర వాహనదారుకు గాయాలవడంతో వైద్యశాలకు తరలించారు.

నాసిరకం కోడిపిల్లల సరఫరాతో నష్టపోయామని ఫిర్యాదు

చంద్రుగొండ, న్యూస్‌టుడే: పెరటికోళ్ల పెంపకానికి నాసిరకం కోడిపిల్లలు సరఫరా చేయటంతో నెలరోజుల్లోనే అవి చనిపోయాయని చంద్రుగొండలో మంగళవారం మహిళాశక్తి సభ్యులు ఎంపీడీవో బయ్యారపు అశోక్‌కు ఫిర్యాదు చేశారు. పెరటికోళ్ల పెంపకం కింద మండలంలోని పలు గ్రామాలకు చెందిన 23 యూనిట్లకు కోడిపిల్లలు సరఫరా చేశారని, పలు యూనిట్లకు చెందిన కోడిపిల్లలు చనిపోయాయన్నారు. ఒక్కో యూనిట్‌కి రూ.6వేలు బ్యాంకు రుణమని, ఇప్పుడు అవి ఎలా చెల్లించాలన్నారు. విచారణ చేసి న్యాయం చేయాలని మహిళాశక్తి సభ్యులు ఎంపీడీవోని కోరారు.

నిరుపేదలకు నిత్యావసరాలు, దుస్తుల పంపిణీ

చర్ల, న్యూస్‌టుడే: ఇటీవల వరదలతో నెల రోజుల పాటు వాగులు కమ్మేయడంతో జలదిగ్బంధంలో చిక్కుకున్న చర్ల మండలంలోని మారుమూల రామచంద్రాపురం ఆదివాసీల దయనీయ పరిస్థితులను తెలుసుకున్న ప్రముఖ హృద్రోగ నిపుణుడు డాక్టర్ డీఎన్ కుమార్, ఆయన సతీమణి డాక్టర్ ప్రతిభ చేయూత అందించారు. స్థానిక రాహుల్ విద్యాలయం విద్యార్థులు, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో మంగళవారం దివంగత రాహుల్ జయంతి సందర్భంగా గ్రామంలోని పేద ఆదివాసీలకు రూ.90వేల విలువైన నిత్యావసర వస్తువులు, కూరగాయలు, దుస్తులు, దుప్పట్లు, పాదరక్షలను అందించారు.

దొంతికుంట, కోనేరు చెరువులకు పార్కుల రూపు..!

అశ్వారావుపేట, న్యూస్‌టుడే

అశ్వారావుపేటలోని దొంతికుంట, కోనేరు చెరువులు అందమైన పార్కులుగా మారనున్నాయి. ఈ రెండు చెరువులను పార్కులుగా మార్చి పట్టణ ప్రజలకు అంకితం ఇవ్వాలని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ప్రతిపాదించినట్లు సమాచారం. భద్రాచలం మార్గంలో ఉన్న దొంతికుంట చెరువు కబ్జాలకు గురికాకుండా చుట్టూ వాకింగ్ ట్రాక్, మధ్యలో వ్యూపాయింట్లు, ట్రాక్ చుట్టూ గ్రిల్, అందమైన క్రోటాన్ మొక్కలతో సుందరంగా తీర్చిదిద్దాలని నిర్ణయించారు. కొద్దిరోజుల్లోనే డీపీఆర్‌ను అధికారులతో సిద్ధం చేయించనున్నట్లు సమాచారం. పట్టణానికి తూర్పున ఉన్న కోనేరు చెరువునూ ఇలాగే అభివృద్ధి చేయనున్నారు.



పార్కుగా మార్చేందుకు ప్రతిపాదించిన దొంతికుంట చెరువు



ప్రస్తుతం కోనేరు చెరువు ఇలా..

ఈ రెండు చెరువులకు పట్టణాభివృద్ధి సంస్థ లేదా ఏసీడీపీ నిధులు వినియోగించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. దొంతికుంట చెరువుకు వాకింగ్ ట్రాక్ సుమారు 3 కి.మీ. వేయాల్సి ఉంటుంది. ఉదయం, సాయంత్రం వేళల్లో నడక సాగించేవారికి ఇది ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది.

అశ్వారావుపేటకు ఎనిమిది కిలోమీటర్ల దూరంలో వెంకమ్మ చెరువు వద్ద ఇప్పటికే వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేసినా ఎవరూ ఉపయోగించుకోలేని పరిస్థితి ప్రస్తుతం నెలకొనడంతో అది కాస్తా అడవిలా తయారై ముళ్లకంచెలు పెరుగుతున్నాయి. పట్టణ ప్రజలకు ఉపయోగపడే దొంతికుంట ఆధునీకరణతో రైతులకు నిరంతరం సాగునీరు ఇవ్వొచ్చు. కబ్జాల చెరనుంచీ కాపాడొచ్చని భావిస్తున్నారు.

దీనిపై స్థానిక శాసనసభ్యుడు జారే ఆదినారాయణ 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ ఈ రెండు చెరువులను పూర్తిస్థాయిలో ఆధునికీకరించి వాకింగ్ ట్రాక్‌లు, వ్యూపాయింట్లతో పార్కుగా తయారు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. త్వరలోనే కార్యాచరణ ప్రారంభం అవుతుందన్నారు.

వినియోగంలోకి తెస్తే అదనపు ఆదాయమే..!

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే

భద్రాచలంలో ట్రాఫిక్ పోలీసు స్టేషన్ పక్కనే నిరుపయోగంగా ఉన్న గ్రామ పంచాయతీకి చెందిన షెడ్డు వినియోగంలోకి తెస్తే అదనపు ఆదాయం సమకూరనుంది. అధికారులు దీనిపై ఆలోచన చేసి ఆచరణలో పెట్టాలని పలువురు పేర్కొంటున్నారు. సుమారు గత ఆరేళ్ల కిందట అక్కడి జాగాలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో రూ. 5 లక్షల నిధులు వెచ్చించి పశువులకు బందెలదొడ్డి కోసం షెడ్డు నిర్మాణం చేశారు. కొంత కాలం బందెలదొడ్డి నిర్వహణ సాఫీగానే కొనసాగింది. అనంతరం పలు కారణాలతో చతికిల పడింది. ప్రస్తుతం ఖాళీగా ఉన్న ఈ షెడ్డును వినియోగంలోకి తెచ్చి అద్దె నిమిత్తం వేలం నిర్వహిస్తే పంచాయతీకి అదనపు ఆదాయం సమకూరే అవకాశం ఉంది. లేకుంటే కనీసం బందెలదొడ్డిగానైనా వినియోగంలోకి తేవాల్సి ఉంది. పట్టణంలో పలు పశువులు రోడ్డుమీదే సంచరిస్తున్నాయి. అధికారులూ దీనిపై ఒకసారి ఆలోచన చేయాల్సి ఉంది. ఈ అంశంపై గ్రామ పంచాయతీ ఈఓ సీహెచ్ శ్రీనివాసరావును 'న్యూస్‌టుడే' వివరణ కోరగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు చేపడతామన్నారు.



నిరుపయోగంగా గ్రామ పంచాయతీ షెడ్డు

కొత్తగూడెం

• కొత్తగూడెం • ఇల్లెందు

పీఆర్‌టీయూ రాష్ట్ర కార్యవర్గంలో ఇద్దరికి చోటు


బి.సంపత్‌కుమార్


ఎన్.వెంకటరమణ

జూలూరుపాడు, న్యూస్‌టుడే: పీఆర్‌టీయూ రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో జూలూరుపాడు మండలానికి చెందిన ఇద్దరు ఉపాధ్యాయ సంఘం నాయకులకు చోటు దక్కింది. హైదరాబాద్‌లో ఈనెల 7, 8 తేదీల్లో సంఘం సమావేశాలు నిర్వహించగా రాష్ట్ర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. దీనిలో జూలూరుపాడు మండలం కాకర్ల ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న బి.సంపత్‌కుమార్‌ను రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, గుండెపూడి ఉన్నత పాఠశాలకు చెందిన ఎన్.వెంకటరమణను రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నుకున్నట్లు వారు వెల్లడించారు. వీరి ఎన్నిక పట్ల జిల్లా ఉపాధ్యక్షుడు కె.శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి హరిలాల్, జూలూరుపాడు మండల అధ్యక్ష, కార్యదర్శులు ప్రభాకర్, ఉపేందర్‌లు హర్షం వ్యక్తం చేశారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కొత్తగూడెం కలెక్టరేట్, న్యూస్‌టుడే: కొత్తగూడెం నార్త్ సెక్షన్ పరిధిలో భజనమందిర్ 33/11 కేవీ విద్యుత్తు ఉపకేంద్రంలో మరమ్మతులు చేపడుతున్నందున బుధవారం హనుమాన్ బస్తీ, బూడిదగడ్డ బస్తీల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ నర్మద మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
కొత్తగూడెం: 8008573723
పాల్వంచ: 9550076766
ఇల్లెందు: 9154846689

సమస్య: గాజులరాజంబస్తీ జిల్లా సర్వజన ఆసుపత్రి గోడ పక్కన ఎలాంటి చెత్త డబ్బాలు ఏర్పాటు చేయలేదు. ఇంట్లో ఉత్పత్తి అయిన చెత్తా, చెదారాన్ని కొందరు రోడ్డు పైనే పడేస్తున్నారు. **- స్థానికులు**



సమాధానం: ఇంటింటికి చెత్త వాహనం ప్రతి రోజు పంపిస్తున్నాం. ప్రజలు కొంత సహకరించాల్సిన అవశ్యకత ఉంది. ఆసుపత్రిలో ఉన్న చెత్తను రోడ్డుపైనే పడేస్తున్నారు. వారికి తగిన అవగాహన కల్పించి రోడ్డుపై ఉన్న చెత్తను శుభ్రం చేయిస్తాం. **- వీరభద్రాచారి, శానిటరీ ఇన్‌స్పెక్టర్** - కొత్తగూడెం పట్టణం, న్యూస్‌టుడే

కొత్తగూడెంలో ఐద్వా రాష్ట్ర మహాసభలు

కొత్తగూడెం సింగరేణి, న్యూస్‌టుడే: అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) రాష్ట్ర మహాసభలను ఈనెల 21, 22, 23 తేదీల్లో కొత్తగూడెంలోని కొత్తగూడెం క్లబ్‌లో నిర్వహించాలని నిర్ణయించినట్లు ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి తెలిపారు. టీచర్స్ భవన్‌లో మంగళవారం ఏర్పాటైన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. దేశం, రాష్ట్రంలో మహిళలపై అత్యాచారాలు, హింసలు పెరుగుతున్నాయని, వాటిని పట్టించుకొనే విధంగా ప్రభుత్వాలు పని చేయడంలేదని విమర్శించారు. రాష్ట్ర మహాసభల ప్రచార గోడపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు మందలపు జ్యోతి, బుగ్గవీటి సరళ, డి.లక్ష్మి, సందకూరి లక్ష్మి, లీలావతి, అన్నవరపు ఇందరి, ఆలేటి సంధ్య, అన్నవరపు పద్మ, నందిపాటి రజిత తదితరులు పాల్గొన్నారు.


గోడపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఐద్వా నాయకులు మల్లు లక్ష్మి, జ్యోతి, సరళ, లక్ష్మి, లీలావతి, ఇందరి తదితరులు

ప్రమాదభరితం... దుర్గంధమయం

అధ్వానంగా మంచినీటి వాల్వ్స్

కొత్తగూడెం పట్టణం, న్యూస్‌టుడే

వర్షాకాలంలో తాగునీటి సంరక్షణ అనివార్యం. సకల రోగాలకు నీటి కాలుష్యం ప్రధాన కారణం. ఈ సమస్యను పరిష్కరించడంలో పురపాలక అధికారులు విఫలమవుతున్నారు. పట్టణానికి సరఫరా చేసే కిన్నెరసాని నీటి సరఫరా వాల్వ్‌ల నిర్వహణను విస్మరిస్తున్నారు. మురికి గుంతలను తలపిస్తున్నా... పట్టించుకోని దుస్థితిలో పురపాలక ఇంజినీరింగ్ అధికారులు కొనసాగుతున్నారు. ప్రజారోగ్యాన్ని మురికి గుంతలకు వదిలేసి చోద్యం చూస్తున్నారు. పురపాలకంలో మొత్తం 36 వార్డులకు నీటి సరఫరా జరగాల్సి ఉంది. ఎనిమిది భారీ జలభాండాగారాల ద్వారా నీటిని పంపిణీ చేస్తున్నారు. ప్రధాన కూడళ్లలో ఉన్న నీటి వాల్వ్‌ల సంరక్షణకు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. మురుగు నీరు, లీకేజీ నీరంతా అందులోనే ఉబికి రోడ్ల పైకి పారుతున్నాయి. దాంతో వాల్వ్‌లు దుర్గంధభరితంగా మారుతున్నాయి. తద్వారా నీటి కాలుష్య సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. కనీసం వాటిపై రక్షణ కప్పులను సైతం ఏర్పాటు చేయడం లేదు. ప్రధాన రహదారులైన నేతాజీ మార్కెట్, భజనమందిరం రోడ్, గణేశ్‌టెంపుల్ ఆటో అడ్డా, హనుమాన్ బస్తీ ఏరియాల్లో మంగళవారం 'న్యూస్‌టుడే' పరిశీలన నిర్వహించింది. వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే విధంగా గుంతలు పడి మురుగు నీటితో నిండి కన్పిస్తున్నాయి. హనుమాన్‌బస్తీలో అసలు వాల్వ్‌లు చెట్లపొదలు పెరిగి అందులో మురుగునీరు కలిసిపోతుంది. నేతాజీ మార్కెట్‌లో నీటి సరఫరా జరిగినప్పుడల్లా నీరంతా వృథాగా రోడ్డుపైకి పారి అపరిశుభ్రతతోపాటు ప్రమాదానికి హేతువుగా నిలుస్తోంది. వాటిపై రక్షణ కప్పులు పగిలిపోయాయి. వాల్వ్‌లను సరి చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ శేషు పేర్కొంటున్నారు.


హనుమాన్‌బస్తీ వద్ద చెట్లపొదల్లో వాల్వ్


నేతాజీ మార్కెట్ దారిలో ప్రమాదకరంగా... పంపు వాల్వ్

ముగ్గురు మట్కా బుక్కర్ల అరెస్టు

కొత్తగూడెం నేరవిభాగం, న్యూస్‌టుడే: పట్టణంలోని ఐస్ మ్యాజిక్ పక్కన ముగ్గురు మట్కా బుక్కర్లను టాస్క్‌ఫోర్సు పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. వారిని త్రీటౌన్ పోలీసులకు అప్పగించారు. పోలీసుల కథనం ప్రకారం... కూలీలైన్ ఏరియాకు చెందిన మట్కా నిర్వాహకులు దినేశ్‌రెడ్డి, దుర్గాప్రసాద్, పవన్‌లు మ్యాజిక్ పక్కన మట్కా స్లిప్పులతో బుక్ చేస్తుండగా అదుపులోకి తీసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నారు.

ఏడుగురు జూదరుల అరెస్టు

పాల్వంచ గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని సీతానగర్ కాలనీ సమీపంలో జూదం ఆడుతున్న ఏడుగురిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. వీరి నుంచి 14వేల నగదు, 5 చరవాణులు స్వాధీనం చేసుకున్నారు.

పందెంకోళ్లు విక్రయిస్తానంటూ మోసం

లక్ష్మీదేవిపల్లి, న్యూస్‌టుడే: పందెంకోళ్లు తక్కువ ధరకు విక్రయిస్తానని ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ఓ వ్యక్తి సెల్‌ఫోన్‌లో వీడియోల ద్వారా పరిచయమై నగదు దోచుకున్న ఘటన మైలారం గ్రామంలో మంగళవారం చోటుచేసుకొంది. గ్రామానికి చెందిన లచ్చు, మరికొందరు యువకులు ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ఓ వ్యక్తి పెట్టిన పందెంకోళ్ల విక్రయ వీడియోను ఇటీవలే చూశారు. సదరు వ్యక్తితో వీరు ఫోన్‌లో మాట్లాడగా ఒక్కో పందెంకోడిని రూ.6 వేలకు విక్రయిస్తానని ముందుగా కొంత నగదు తన ఫోన్‌పే నెంబర్‌కు పంపాలని హిందీలో చెప్పాడు. వచ్చీరాని హిందీలో మాట్లాడిన స్థానికులు ముందుగా రూ.1,000 అతనికి పంపారు. కోళ్లు వస్తున్నాయని లోకేషన్ పెట్టమని మిగతా నగదు త్వరగా పంపాలని ఆ వ్యక్తి మళ్లీ ఫోన్ చేశాడు. దీంతో మరో దఫా రూ.3 వేలు పంపించారు. అనంతరం అతనికి ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ అని వచ్చింది. దీంతో లబోదిబోమంటున్నారు. చిన్న మొత్తమే నష్టపోయామన్న భావనతో కేసు పెట్టకుండా మిన్నకుండిపోయారు.

బెస్ట్ అవైలబుల్ పథకానికి ధ్రువపత్రాలు సమర్పించండి

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: 2024-25 బెస్ట్ అవైలబుల్ పథకానికి అర్హులైన 6, 7, 8, 9 తరగతుల విద్యార్థులు తమ ధ్రువీకరణ పత్రాలు ఈనెల 20లోపు జతపరచాలని భద్రాచలం ఐటీడీఏ పీఓ రాహుల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ తరగతుల్లో మొత్తం 38 సీట్లను ఈనెల 22న లాటరీ ద్వారా భర్తీ చేస్తారని వెల్లడించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన విద్యార్థులే అర్హులని, వారి కుల, నివాస, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు గిరిజన సంక్షేమశాఖ ఐటీడీఏ భద్రాచలం కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

జార్జిరెడ్డి ఆశయ సాధనకు ఉద్యమిద్దాం

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే: శాస్త్రీయ విద్యావిధానం, జార్జిరెడ్డి ఆశయాలను సాధించేందుకు పోరాడాల్సిన అవసరం ఉందని ఉపాధ్యాయ సంఘాల నాయకులు వేణు, పూర్ణచందర్‌రావు, బాలు పిలుపునిచ్చారు. ఈ నెల 24న హైదరాబాద్‌లో పీడీఎస్‌యూ అర్ధశతాబ్దోత్సవ సభ నిర్వహిస్తున్నట్లు మంగళవారం తెలిపారు. ఇల్లెందులో జరిగిన సన్నాహక సమావేశంలో గోడపత్రాలను ఆవిష్కరించారు. సభ విజయవంతం చేయాలని కోరుతూ 21న ఖమ్మంలో సమావేశం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎన్డీ రాష్ట్ర నాయకులు ఆవునూరి మధు సీతారామయ్య, ఐలయ్య పాల్గొన్నారు.

జూలూరుపాడు ఎస్సైకి బంగారు పతకం

జూలూరుపాడు: ఎస్సై రాణాప్రతాప్‌కు వరంగల్‌లో నిర్వహించిన పోలీస్ డ్యూటీ మీట్‌లో బంగారు పతకం సాధించారు. ఈ మేరకు పతకాన్ని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా చేతుల మీదుగా అందుకున్నారు. మంగళవారం ఎస్సైని పలువురు కలిసి అభినందించారు.

జూలూరుపాడులో భారీ వర్షం


జూలూరుపాడు, న్యూస్‌టుడే: జూలూరుపాడులో మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. పగలంతా ప్రజలు ఉక్కపోతకు గురయ్యారు. సాయంత్రం ఒక్కసారిగా మబ్బులు పట్టి గంటపాటు వర్షం కురిసింది. దీంతో పలు వీధుల్లో వరద నీరు చేరింది. రహదారులపైకి నీరు చేరడంతో రాకపోకలకు అసౌకర్యంగా మారింది. పాపకొల్లు రహదారిలో పలు చోట్ల వర్షం నీరు నిలవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

ఉత్తర్వు 76 ద్వారా ఇంటి పట్టాలు పునఃప్రారంభించాలి

కొత్తగూడెం పట్టణం, న్యూస్‌టుడే: ఉత్తర్వు సంఖ్య 76 ద్వారా ఇంటి పట్టాల పంపిణీ ప్రక్రియను పునఃప్రారంభించాలని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.కామేశ్ డిమాండ్ చేశారు. పార్టీ కార్యాలయంలో మంగళవారం జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో గంధం మల్లికార్జునరావు, హరికృష్ణ, మురళి, తనూష్, సాయి పాల్గొన్నారు.

'సభ్యత్వ నమోదుపై భాజపా దృష్టి'

కొత్తగూడెం కలెక్టరేట్, న్యూస్‌టుడే: అత్యధిక సభ్యత్వ నమోదుపై భాజపా శ్రేణులు దృష్టి సారించాలని ఆ పార్టీ కొత్తగూడెం అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ టి.నరేంద్రబాబు పిలుపునిచ్చారు. ఆకుల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మంగళవారం గాంధీ కాలనీలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. హర్యానా ఎన్నికల ఫలితాల్లో భాజపా విజయం సాధించడం భాజపా శ్రేణుల్లో మరింత ఉత్సాహాన్ని నింపిందన్నారు. పలువురితో సభ్యత్వం నమోదు చేయించారు. పైడిపాటి రవీందర్, రాయుడు నాగేశ్వరరావు, మోహన్‌రావు, గణేష్, రామారావు, శంకర్, ఉమ, సరోజిని, శంకర్, మాధవి పాల్గొన్నారు.


సభ్యత్వ నమోదులో టి.నరేంద్రబాబు, నాగేశ్వరరావు, రవీందర్

పట్టణ రెడ్డి సంఘం కమిటీ ఎన్నిక

కొత్తగూడెం పట్టణం, న్యూస్‌టుడే: కొత్తగూడెం రెడ్డి సంక్షేమ సంఘం కమిటీ ఎన్నిక కేసీఓఏ క్లబ్‌లో మంగళవారం జరిగింది. సంక్షేమ సంఘం సర్వసభ్య సమావేశం అనంతరం కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా లేళ్ల వెంకటరెడ్డి, అధ్యక్షుడిగా వజ్రాల జమలారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా యరమల శ్రీనివాస్‌రెడ్డి, కోశాధికారి కాసాని శ్రీనివాసరెడ్డిలతోపాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. సంఘం గౌరవ సలహాదారులు మేరెడ్డి జనార్ధన్‌రెడ్డి, గోపాలరెడ్డి, సోమిరెడ్డి పాల్గొన్నారు.

భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో ఆయుధ పూజ

చుంచుపల్లి, న్యూస్‌టుడే: రుద్రంపూర్ మార్కెట్ ఏరియాలోని అమ్మవారి మండపంలో భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో మంగళవారం ఆయుధ పూజ నిర్వహించారు. భజరంగ్‌దళ్ జిల్లా సంయోజక్ చింటేశ్వర్, వీహెచ్‌పీ చుంచుపల్లి ప్రకాండ కార్యదర్శి పి.వెంకటేశ్వర్లు ఆయుధ పూజ విశిష్టతను వివరించారు. ఈ కార్యక్రమంలో సాగర్, మహేశ్, రమేశ్, రవి, రేశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమాలకు ఊతం సాంస్కృతిక కార్యక్రమాలే

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరిలో ఏదో ఒక కళ దాగి ఉంటుందని, దానిని ఉపయోగించుకుంటే అద్భుత ఫలితాలు సాధించవచ్చని ఇల్లెందు ఏరియా జీఎం జాన్ ఆనంద్ అన్నారు. వర్క్ పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఇల్లెందు ఏరియా ఆధ్వర్యంలో ఇల్లెందు, మణుగూరు ఏరియా స్థాయి పోటీలు నిర్వహించగా.. మంగళవారం ప్రారంభించారు. ఎస్‌ఓటూజీఎం బొల్లం వెంకటేశ్వర్లు, డీజీఎం పర్సనల్ మోహన్‌రావు, నజీర్ అహ్మద్, అన్వర్, సాయిస్వరూప్ పాల్గొన్నారు.


కళాకారులను అభినందిస్తున్న ఏరియా జీఎం జాన్ ఆనంద్

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే: ఇల్లెందు జీఎం కార్యాలయం సమీపంలోని పోచమ్మ దేవాలయం వద్ద సోమవారం 21ఫిట్ విజయలక్ష్మీనగర్‌కు చెందిన బానోత్ మాన్‌సింగ్(68) సైకిల్‌మీద వెళ్తుండగా ద్విచక్రవాహనంపై వచ్చిన పరమయ్య ఢీకొట్టాడు. ఈఘటనలో తీవ్రంగా గాయపడిన మాన్‌సింగ్ ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందారు. కుమారుడి ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై రవి తెలిపారు.

'కిన్నెరసాని' అందచందాలు

పాల్వంచ మండలంలోని కిన్నెరసాని ప్రాజెక్టు ప్రకృతి అందాలకు నిలయం. కాటేజీ గుట్టల ప్రతిబింబం కత్తి మాదిరి కనిపిస్తోంది.
- ఈనాడు, ఖమ్మం, న్యూస్‌టుడే, పాల్వంచ గ్రామీణం



అటవీశాఖ క్రీడల్లో మల్లయ్య సత్తా

జూలూరుపాడు, న్యూస్‌టుడే: అటవీ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో నిర్వహించిన క్రీడల్లో జూలూరుపాడు అటవీ రేంజి పరిధిలోని పాపకొల్లు అటవీ సెక్షన్ అధికారి మల్లయ్య తన సత్తాచాటారు. హైదరాబాద్‌లోని దూలపల్లి అటవీ అకాడమీ మైదానంలో ఈనెల 6, 7 తేదీల్లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి క్రీడల్లో మల్లయ్య 800, 100, 200 మీటర్ల పరుగు పందాల్లో పాల్గొని ప్రతిభ కనబరిచారు. హైజంప్ విభాగంలోనూ పాల్గొని తృతీయ స్థానంలో నిలిచారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీల్లోనూ మంచి ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికైన ఆయన అక్కడ కూడా పతకాలు సాధించడం పట్ల అటవీ శాఖ ఉన్నతాధికారులు, తోటి ఉద్యోగులు నుంచి అభినందనలు అందుకున్నారు.


అటవీ సెక్షన్ అధికారి మల్లయ్య

బతుకమ్మ.. బతుకమ్మ ఉయ్యాలో

ఇల్లెందు గ్రామీణం, జూలూరుపాడు, పాల్వంచ, న్యూస్‌టుడే: సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో సింగరేణి పాఠశాల ఆవరణలో మంగళవారం బతుకమ్మ ఉత్సవాలు నిర్వహించారు. సేవా సమితి అధ్యక్షురాలు నిమ్మి ఆనంద్ హాజరై మాట్లాడారు. జూలూరుపాడు, వెంగన్నపాలెం, బేతాళపాడు, పాపకొల్లు, కాకర్లలో పిల్లలు, పెద్దలు రకరకాల పూలతో బతుకమ్మలను పేర్చి సందడి చేశారు. పాల్వంచలోని కేటీపీఎస్ ఐదు, ఆరు దశల యూనిట్లలో బతుకమ్మ సంబరాలను నిర్వహించారు. ఉద్యోగినులు ఆడిపాడారు.


ఇల్లెందులో సేవా సమితి సభ్యులు


కేటీపీఎస్ వేడుకలో సీఈ ప్రభాకర్‌రావు, ఎస్ఈలు

పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి

పాల్వంచ, న్యూస్‌టుడే: విద్యుత్ రంగంలో దీర్ఘకాలంలో పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించాలని టీఎస్ జెన్కో సీఎండీ రోనాల్డ్‌రాస్‌ను తెలంగాణ ఎలక్ట్రిసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్(హెచ్-64) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు రావుల మురళి, దుగ్గిరాల సుధాకర్ కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని మంగళవారం హైదరాబాద్ విద్యుత్‌సౌధలో అందజేశారు. ప్రధానంగా ఈపీఎఫ్ నుంచి జీపీఎఫ్, గృహాల హెచ్‌ఆర్ఏ, ఇన్సెంటివ్, కారుణ్య నియామకాలు పరిష్కరించాలని విన్నవించారు. వయోపరిమితి 44 నుంచి 46 సంవత్సరాలు జీఓను పరిగణలో తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు ఏసయ్య, మస్తాన్, లక్ష్మయ్య పాల్గొన్నారు.


సీఎండీ రోనాల్డ్ రాస్‌కు సమస్య విన్నవిస్తున్న హెచ్-64 యూనియన్ నాయకులు

దుర్గామాతకు కరెన్సీ నోట్లతో అలంకరణ

పాల్వంచ, న్యూస్‌టుడే: పాల్వంచ గట్టాయిగూడెం ఆదర్శ నగర్‌లో కొలువుదీర్చిన దుర్గమ్మ మండపంలో మంగళవారం ప్రత్యేక అలంకరణ చేశారు. ఫ్రెండ్స్ యూత్ నిర్వాహకులు శ్రీనివాసరావు, హిమవరణ్, రామకృష్ణ ఆధ్వర్యంలో రూ.5 లక్షల కరెన్సీతో అమ్మవారిని అలంకరించారు.

టేకులపల్లి, న్యూస్‌టుడే: టేకులపల్లి కోదండరామాలయం, బ్రహ్మంగారి వీధిలో కొలువుదీరిన అమ్మవారి సన్నిదానంలో కుంకుమార్చన పూజలు నిర్వహించారు. కేఓసీలో పీఓ వాసంశెట్టి శ్రీనివాసరావు దంపతులు పూజల్లో పాల్గొన్నారు.

జూలూరుపాడు, న్యూస్‌టుడే: దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జూలూరుపాడులో మంగళవారం జ్యోతిర్లింగార్చన వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు శివలింగం ఆకారంలో ఏర్పాటు చేసిన 365 దీపాలను వెలిగించారు. వెంగన్నపాలెం, కాకర్ల, గుండెపూడి, పాపకొల్లు, సూరారం గ్రామాల్లో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వనదేవత అలంకరణలో అమ్మవారు దర్శనమిచ్చారు.

సుజాతనగర్, న్యూస్‌టుడే: విజయదశమి నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా సుజాతనగర్ మండల కేంద్రంలో ఆరో రోజు లక్ష్మీదేవి అవతారంలో మంగళవారం అమ్మవారికి ఘనంగా పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బొడ్డు శ్యామ్, కేశవరావు, వినీల్, పూర్ణ ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.


పాల్వంచ: ఆదర్శనగర్‌లో అలంకరణ


టేకులపల్లి: కేఓసీలో పూజలు చేస్తున్న పీఓ శ్రీనివాసరావు, అధికారులు


జూలూరుపాడులో శివలింగం ఆకారంలో దీపాలను వెలిగించిన భక్తులు

కిన్నెరసానిలో సౌకర్యాల కల్పనకు ప్రతిపాదనలు పంపండి: కలెక్టర్

పాల్వంచ గ్రామీణం, న్యూస్‌టుడే: కిన్నెరసాని పర్యాటకులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలని కలెక్టర్ జితేశ్ వి.పాటిల్ సూచించారు. అక్కడి అభివృద్ధి పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. పిల్లలు ఆడుకునే పార్కును పునరుద్ధరించాలన్నారు. వెదురుతో నీడ సౌకర్యం కల్పించాలన్నారు. మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం కల్పించాలని, భోజనాలు చేసేందుకు వీలుగా, కోతుల నుంచి రక్షణగా షెడ్లు నిర్మించాలన్నారు. డ్వాక్రా సంఘాలతో క్యాంటిన్ ఏర్పాటు చేసి తక్కువ ఖర్చుతో తినుబండారాలు, టిఫిన్లు, భోజనాలు ఏర్పాటు చేయాలన్నారు. పర్యాటకులు సేదతీరేలా వెలగ, మారేడు, కరక్కాయ, అల్లనేరేడు, బంక నక్రేరు, తాండ్ర వంటి మొక్కలు ఏర్పాటు చేయాలన్నారు. వసతుల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాలన్నారు. ఆయనతోపాటు తహసీల్దార్ వివేక్, ఎంపీడీవో విజయభాస్కర్‌రెడ్డి, ఎంపీవో నారాయణ, ఏఈ సురేశ్, ఎఫ్‌బీవో రాములు తదితరులు పాల్గొన్నారు.

భాజపా సంబురాలు

పాల్వంచ గ్రామీణం, న్యూస్‌టుడే: హర్యానాలో భాజపా విజయంతో భాజపా కొత్తగూడెం కోకన్వీనర్ బుడగం రవికుమార్ ఆధ్వర్యంలో మంగళవారం బాణసంచా కాల్చి మిఠాయిలు పంచారు. రవికుమార్ మాట్లాడుతూ మోదీ వెన్నంటే ప్రజలు ఉన్నారన్నారు. పార్టీ నాయకులు, రాజు, ప్రసాద్, బాలు, ఆనంద్, సుధాకర్, మల్లేశ్, ప్రతాప్, ధనలక్ష్మి, సలీమా, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభ్యాసకులకు ధ్రువపత్రాలు అందజేత

పాల్వంచ, న్యూస్‌టుడే: పాల్వంచ నవ లిమిటెడ్ సీఎస్ఆర్ పాలసీ కార్యక్రమంలో భాగంగా టైలరింగ్, బ్యూటీషియన్, ట్యాలీ, డీటీపీ కోర్సులు పూర్తి చేసుకున్న అభ్యాసకులకు ధ్రువీకరణ పత్రాలను సంస్థ నిర్వాహకులు మంగళవారం అందజేశారు. మహిళా సాధికారిత కేంద్రాన్ని సౌత్ ఆఫ్రికా ప్రధానమంత్రి కార్యాలయం ఉద్యోగులు సందర్శించారు. ముఖ్య అతిథిగా హాజరైన అలెగ్జాండర్ శిక్షణ పొందిన వారికి పత్రాలను అందించారు. సంస్థ అధికారులు నిఖిల్ దేవినేని, దుర్గాప్రసాద్, శరత్‌బాబు తదితరులు ప్రసంగించారు.


యోగ్యత పత్రాలు అందజేస్తున్న అలెగ్జాండర్

రుద్రంపూర్‌లో ఆటో సీరియల్ జగడం

● ఘర్షణలకు దారి తీస్తున్న వైనం


ప్రయాణికులకు తప్పని ఇక్కట్లు

కొత్తగూడెం నేరవిభాగం, న్యూస్‌టుడే

రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని సింగరేణి కార్మిక ప్రాంతమైన రుద్రంపూర్‌లో ఆటోసీరియల్ జగడం ముదురుతోంది. కొంత కాలంగా కొంతమంది ఆటో డ్రైవర్లు అనధికారిక రాజ్యాన్ని సాగిస్తున్నారు. తోటి ఆటో డ్రైవర్లను బెదిరిస్తూ దౌర్జన్యాలకు పాల్పడుతున్నారు. ప్రశ్నిస్తే భౌతికదాడులకు తెగబడుతున్నారు. ఆర్టీవో అధికారులు, పోలీసు అధికారులు కౌన్సెలింగ్ నిర్వహించి హెచ్చరికలు జారీ చేసినా ఆటో డ్రైవర్ల తీరు మారకపోవడంతో తాజాగా మరో వివాదం చోటుచేసుకుంది. ఈ గొడవలు కాస్త చిలికి చిలికి గాలివానగా మారి పెను ప్రమాదాలకు దారి తీసే పరిస్థితులు ఇక్కడ నెలకొంటున్నాయి. ఉపాధి కోసం సాగుతున్న ఆటో కార్మికులుగా సాగుతున్న డ్రైవర్ల మధ్య వ్యక్తిగత కక్షలకు ఆజ్యం పోస్తున్నాయి.

గౌతంపూర్, రుద్రంపూర్ ఏరియా నుంచి అత్యవసర పరిస్థితుల్లో ఆటోల్లో ప్రయాణించాలంటే ప్రయాణికులకు చుక్కలు కన్పిస్తున్నాయి. రుద్రంపూర్ వద్ద ఆటో సీరియల్ పేరుతో కొందరు ఆటో డ్రైవర్లు అడ్డుకుని మహిళా ప్రయాణికులను కిందకు దింపేస్తున్నారు. ఆటో డ్రైవర్లతో గొడవకు దిగుతున్నారు. అత్యవసరంగా వెళ్లాలని ప్రయాణికులు ప్రశ్నిస్తే మా ఆటోల్లో వెళ్లండి... ఇక్కడ సీరియల్ ప్రకారమే ఆటోలు నడవాలి.. లేకపోతే ఊరుకోమంటూ బెదిరింపు ధోరణులు కొనసాగుతున్నాయి. కొద్ది రోజుల క్రితం నిండు గర్భిణిని కిందకు దింపేసిన సంఘటనలో గొడవ జరిగింది. ఈ విషయంలో రెండో పట్టణ పోలీసులకు సైతం ఫిర్యాదు చేశారు. ఇలా ప్రతిరోజు ప్రయాణికులు ఇతర రన్నింగ్ ఆటోలు ఎక్కితే స్థానిక ఆటో డ్రైవర్ల వేధింపులకు గురవుతున్నారు.

బయటి ఆటోలు వస్తే రూ.30 చెల్లించాల్సిందే

కొత్తగూడెం నుంచి ఇతర ఆటో డ్రైవర్లు కిరాయి ఎక్కించుకుని ప్రయాణికులను రుద్రంపూర్, గౌతంపూర్‌కి తీసుకెళ్తే స్థానిక అడ్డా నిర్వాహకులకు ఒక్కో ఆటోకు రూ.30 చెల్లించాలని హుకుం జారీ చేస్తున్నారు. కొత్తగూడెం, రామవరం, ఇతర ప్రాంతాల నుంచి ఒక వేళ ప్రయాణికులను తీసుకెళ్లినా వచ్చేటప్పుడు మళ్లీ ఖాళీగా రావాల్సిన పరిస్థితులు నెలకుంటున్నాయి. అడ్డాల వద్ద నిలిపివేసి స్థానిక ఆటో డ్రైవర్లు కొందరు ఇబ్బందులకు గురిచేస్తున్నారు. పైగా అక్కడ సీరియల్ అడ్డాను కొనసాగించినందుకు ప్రతి ఆటో డ్రైవర్(స్థానికులు) రూ.100 రుసుము చెల్లించాల్సిందే. ఇలాంటి పరిస్థితుల్లో ప్రయాణికుల నుంచి అధిక ఛార్జీలు వసూలు చేసే పరిస్థితులు సైతం కొనసాగుతున్నాయి. ఈ దందా అంతా ముఠా తగాదాలుగా మారి శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. పోలీసు, ఆర్టీఓ అధికారులు స్పందించిన తక్షణ చర్యలు తీసుకోకపోతే పరిస్థితులు తీవ్రస్థాయికి చేరే ప్రమాదం లేకపోలేదు. ఈ విషయమై రెండో పట్టణ ఎస్‌హెచ్‌ఓ రమేశ్‌ను వివరణ కోరగా గతంలో సామరస్యంగా ఉండాలని కౌన్సెలింగ్ నిర్వహించామని, అదే పునరావృతం అయితే తప్పనిసరిగా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ఇద్దరు ఆటో డ్రైవర్లపై ఫిర్యాదు

కొత్తగూడెం నేరవిభాగం, న్యూస్‌టుడే: రుద్రంపూర్ ఏరియాలో ప్రయాణికులను గౌతంపూర్‌లో ఎక్కించుకుని వెళ్తున్న నూటి కూర్తి అనిల్ అనే ఆటో డ్రైవర్‌పై దుర్భాషలాడి అతని ఆటోను అడ్డగించి బెదిరించిన మరో ఇద్దరు ఆటోడ్రైవర్లపై రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశాడు. నలుగురు మహిళా ప్రయాణికులను రుద్రంపూర్ వద్ద దింపుతుండగా తిలక్‌నగర్‌కి చెందిన ఆటో డ్రైవర్ మరో ఇద్దరు ప్రయాణికులను తన ఆటోలో ఎక్కించాడని, వారిని తీసుకెళ్తుండగా శ్రావన్, భార్గవ్‌లు ఆటోకు అడ్డంగా వచ్చి నిలుచున్నారు. దుర్భాషలాడుతూ ప్రయాణికులను దింపేయాలంటూ బెదిరించడంతో డయల్ 100కి ఫోన్ చేశాడు. ఆటోలో ఉన్న ప్రయాణికులను దిగమని బెదిరిస్తే వారు దిగమని చెప్పడంతో అడ్డు తొలగిపోయారు. కావాలని ఉద్దేశపూర్వకంగా బెదిరిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఫిర్యాదుపై విచారణ నిర్వహించిన అనంతరం చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.